


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర **రాజముద్ర**

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | ఆదివారం | 04.01.2026 | సంపుటి : 2 | సంచిక :329 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Sunday | 04.01.2026 | volume : 2 | Issue : 329 | Pages : 8 | Cost : 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


# మిగులు జలాలపై కేసీఆర్ హామీతోనే బనకచర్ల

## గోదావరి జలాలు తాకట్టు పెట్టిన కేసీఆర్



- జలశక్తి శాఖ సమావేశంలోనే కేసీఆర్ సలహా
- అపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనూ కృష్ణా జలాలపై రాజీ
- అసెంబ్లీలో బండారం బయటపడుతుందనే ముఖం చాటేసిన నేతలు
- 'నీళ్లు-నిజాలు'పై జరిగిన స్వల్పకాలిక చర్చలో సిఎం రేవంత్
- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు అనుమతులు కోరుతూ అసెంబ్లీ తీర్మానం

02

తెలంగాణ నీటి హక్కులను తాకట్టు పెట్టిన కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. గోదావరి - బనకచర్లకు 2016లో కేసీఆర్ హయాంలోనే పునాది పడిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనసభలో 'నీళ్లు-నిజాలు'పై జరిగిన స్వల్పకాలిక చర్చలో సీఎం మాట్లాడారు. ఏపీ ప్రతిపాదిత బనకచర్ల ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కృష్ణా జలాల అంశంపై శనివారం సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ.. గోదావరి జలాలు వృధాగా సముద్రంలో కలిసిపోతున్నాయని.. వాటిని వాడుకోవాలని 2015లో జరిగిన కేంద్ర జలశక్తి సమావేశంలో అప్పటి సీఎం కేసీఆర్ సలహా ఇచ్చారు.

## పేదలకు అండగా నిలవడమే సర్కార్ లక్ష్యం

- అర్హులందరికీ గృహ జ్యోతి పథకం వర్తింపు
- అసెంబ్లీలో డిప్యూటి సిఎం భట్టి వెల్లడి



పేద, బడుగు వర్గాలు ఆత్మగౌరవంతో జీవించడమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క తేల్చిచెప్పారు. పార్టీలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ గృహ జ్యోతి వర్తిస్తుందన్నారు. తెలంగాణ అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్రంలోని వివిధ అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇచ్చారు. ప్రధానంగా గృహ జ్యోతి పథకం, ఇంద్రమ్మ ఇళ్లు, వ్యవసాయ పథకాలు, సోయా కొనుగోలు వంటి ముఖ్య సమస్యలపై చర్చలు జరిగాయి.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- గత పదేళ్లలో ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం
- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి వెల్లడి



గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు చెల్లించిన బిల్లులలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అన్నారు. ప్రస్తుతం విచారణ జరుగుతోందని, విచారణ పూ-ర్తయిన తర్వాత పెండింగ్ బిల్లులను చెల్లిస్తామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.



## మెదక్ జిల్లాలో దారుణ ఘటన

### ప్రియుడి మోజులో భర్త దారుణ హత్య

మెదక్ జిల్లా శివంపేట మండలం తిమ్మాపూర్ లో దారుణం చోటు చేసుకుంది. వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది భార్య.. మద్యం మత్తులో భర్త స్వామి (35) చెరువులో పడి చనిపోయినట్టుగా నమ్మించేందుకు ప్రయత్నం చేసింది.

04



## బంగ్లాలో ఆగని దాడులు

- వరుస దాడుల్లో హిందువుల హతం
- తాజాగా మరో హిందూ వ్యాపారి మృతి

06

## శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి అక్రమంగా తరలింపు



- బీఆర్ఎస్ హయాంలో ఏపీ కృష్ణాజలాల జలదోపిడీ
- రోజుకు 13 టిఎంసిల నీరు తరలించుకుపోయిన ఏపీ
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పట్టించుకోని బిఆర్ఎస్
- చోద్యం చూస్తూ కూర్చున్న నాటి సిఎం కెసిఆర్
- కృష్ణా నదీ జలాల హక్కులపై లఘు చర్చ మంత్రి ఉత్తమ్

బిఆర్ఎస్ హయాంలోనే ఏపీ నీటి దోపిడీ జరిగిందని, అందుకు నాటి సిఎం కెసిఆర్ చూస్తూ ఊరుకున్నారని అసెంబ్లీలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి అక్రమంగా నీరు తరలిస్తుంటే బీఆర్ఎస్ సర్కారు చోద్యం చూసిందన్నారు. ఏపీ ప్రభుత్వం రోజుకు 13 టీఎంసీలు తరలించుకుపోయేలా ప్రాజెక్టును విస్తరించింది.

హైదరాబాద్, జనవరి 3 : జగన్ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతలు ప్రాజెక్టు నిర్మిస్తుంటే బీఆర్ఎస్ కనీసం అభ్యంతరం చెప్పలేదన్నారు. తెలంగాణ అసెంబ్లీలో కృష్ణా నదీ జలాల హక్కులపై లఘు చర్చ ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణా నదీ జలాల విషయంలో గొప్పగా చేశామంటూ బీఆర్ఎస్ పార్టీ చెప్పుకుంటోందని విమర్శించారు. కృష్ణా నదీ జలాల్లో ఒక్క నీటి చుక్క కూడా వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ హక్కులను కాపాడటంలో ఎక్కడా రాజీపడబోమని తేల్చిచెప్పారు. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాయలసీమ ఎత్తిపోతలపై

- మిగతా 2 లో..

## పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు హాజరు కామనలేదా

- నాటి ఉత్తమ్ లేఖను బయటపెట్టిన హరీష్ రావు
- ఆనాడు విపక్షంలో అన్నదేమిటి.. ఇప్పుడు చేస్తున్నదేమిటి

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. అసెంబ్లీలో ఆడియో, వీడియో ప్రజెంటేషన్ నిర్వహిస్తే సభకు హాజరుకాబోమని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాసిన లేఖ గుర్తుందా అని ప్రశ్నించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా 30-03-2016 న మీరు స్పీకర్‌కు రాసి సంతకం పెట్టిన ఉత్తరం గుర్తుందా? అని నిలదీశారు.



హైదరాబాద్,జనవరి3 : అసెంబ్లీలో ఆడియో-విజువల్ ప్రెజెంటేషన్ నిర్వహిస్తే, అది భారత దేశ పార్లమెంట్ సంప్రదాయాలకు విరుద్ధం. అందుకే మేము సభకు హాజరుకాబోమని నాడు టీపీసీసీ అధ్యక్షుడిగా లేఖ

- మిగతా 2 లో..




## గాంధీ పేరును తొలగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం

- ఉపాధి హామీ పేరు మార్పు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం రాజ్యాంగ విలువలకు, ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో ఐఎన్‌టీయూసీ, గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాకు మహేశ్‌కుమార్‌గౌడ్

- మిగతా 2 లో..



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 150 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 177 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 257 (కిలో) |
| స్కిన్ లెస్ | 292 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹88



## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న పవన్ కళ్యాణ్

కొండగట్టు అంజన్న దయ వల్లనే తాను ప్రాణాల తో బయటపడ్డానని, ఆయనంటే తనకు ఎన్నలేని భక్తి విశ్వాసాలని ఏపీ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామిని శనివారం పవన్ దర్శించుకున్నారు.



## ఎదురు కాల్పుల్లో 12మంది నక్సల్స్ హతం

రాయపూర్,జనవరి3(ఆర్ఎన్ఎ): ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. శనివారం మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో 12 మంది మావోయిస్టులు తమ ప్రాణాలు కోల్పోయారని పోలీసులు వెల్లడించారు. మృతుల్లో కొంటా ఏరియా కమిటీ కార్యదర్శి మంగడు ఉన్నారు. ఘటనా స్థలం నుంచి ఏకే-47, ఇన్సాస్ రైఫిల్స్, ఇతర ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మరో ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మృతి చెందారు.

## కూనంనేనివి దివాళాకోరు రాజకీయం

- మోడీపై వ్యక్తిగత విమర్శలపై మండిపాటు
- ఎక్స్ వేదికగా కిషన్ రెడ్డి విమర్శలు



మోదీపై ఎమ్మెల్యే కూనంనేని వ్యాఖ్యలు రాజకీయ దివాళాకోరుతనాన్ని బయటపెట్టాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రాజకీయాల్లో హుందాతనం, పరిణతి అవసరమని చెప్పకొచ్చారు. అంతేకానీ ప్రధానమంత్రిపై వ్యక్తిగత ధూషణలు, అర్థంలేని ఆరోపణలు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సీపీఐ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలు హేయ-ఎమైన వని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

## ఆనాడు విపక్షంలో అన్నదేమిటి..
# ఇప్పుడు చేస్తున్నదేమిటి?

(మొదటిపేజీ తరువాయి)

రాసి.. నేడు మంత్రి హోదాలో అసెంబ్లీ హాలులో ప్రజెంటేషన్‌కు సిద్ధపడటం.. మీ రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఆ ఉత్తరంపై నేటి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పద్మావతి సంతకాలు చేశారని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అనైతికత, ద్వంద్వ ప్రమాణాలను ఈ ఒక్క ఉత్తరం బట్టబయలు చేస్తుందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విలువలు, రాజ్యాంగం, పార్లమెంట్ స్ఫూర్తి వంటి మాటలు వల్లెవేస్తారని.. అధికారంలోకి రాగానే అదే విలువలకు తిలోదకాలు ఇస్తారని మండిపడ్డారు. ఇదే కాంగ్రెస్ పార్టీ అసలు నైజమని వ్యాఖ్యానించారు. అధికార పక్షానికి ప్రజెంటేషన్‌కు అనుమతినిస్తే.. బీఆర్ఎస్‌కూ అదేవిధంగా అనుమతి ఇవ్వాలని బీఏసీ సమావేశంలో, ఉత్తరం ద్వారా స్పీకర్‌ను కోరామని హరీశ్‌రావు తెలిపారు. అయినప్పటికీ ఆ అభ్యర్థనను స్పీకర్ తిరస్కరించారని పేర్కొన్నారు. ఇదే కాంగ్రెస్ పార్టీకి, బీఆర్ఎస్ పార్టీకి మధ్య ఉన్న అసలు తేడా అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక.. కాంగ్రెస్ అన్ని సంప్రదాయాలు, పద్ధతులు, మర్యాదలకు భంగం కలిగిస్తూ.. రాజ్యాంగానికే తూట్లు పొడవడాన్ని తన మార్పుగా చూపిస్తోందని ఎద్దేవా చేశారు. ఆ మార్పు అసలు అర్థం ఏమిటో ప్రజలు ఇప్పుడు స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

# గోదావరి జలాలు తాకట్టు పెట్టిన కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

వెళ్లారని.. కృష్ణా జలాల్లో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చాలని ఆయన ఒప్పుకున్నారని తెలిపారు. కృష్ణా ట్రైబ్యునల్ తుది తీర్పు వచ్చేవరకు ఈ ఒప్పందానికి కట్టుబడి ఉంటామని సంతకం పెట్టి కృష్ణా జలాల్లో తెలంగాణకు కేసీఆర్ మరణ శాసనం రాశారని విమర్శించారు. కృష్ణా జలాల్లో వాటా పెంపు కోసం 2020లో మరోసారి అవకాశం వస్తే కూడా కేసీఆర్ ఉపయోగించుకోలేదన్నారు. అసలు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు కేసీఆర్‌కు సంబంధమే లేదని.. ఈ ప్రాజెక్ట్ కోసం మాజీ ఎంపీ విఠల్ రావు మొదటిసారి కేంద్రానికి లేఖ రాశారని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ కోసం పార్టీలకతీతంగా ఆనాడు మహబూబ్ నగర్ జిల్లా నేతలు సంతకాలు చేశారన్నారు. 2013లోనే పాలమూరు ప్రాజెక్టు నిర్మాణానికి కాంగ్రెస్ జీవో ఇచ్చిందని.. విఠల్ రావు లేఖతోనే పాలమూరు ప్రాజెక్టుకు పునాది పడిందని చెప్పారు. ప్రాజెక్ట్ అడిగింది కాంగ్రెస్.. సాధించింది కాంగ్రెస్సేనని.. ఇందులో బీఆర్ఎస్ పాత్ర ఏమిలేదని పేర్కొన్నారు. నీళ్లను ఏపీకి తాకట్టు పెట్టి మాపై నిందలు వేస్తున్నారని ఫైర్ అయ్యారు. నిజాలన్నీ బయటకు వచ్చే సరికి బహిరంగ సభల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని.. బండారం బయటపడుతుందని అబద్దాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. 'గోదావరిలో మిగులు జలాలు ఉన్నాయి.. వాడుకోవాలని జల్‌శక్తిశాఖ భేటీలో కేసీఆర్ అన్నారు. ఆయన చెప్పిన మాటలతోనే చంద్రబాబు బనకచర్ల ఆలోచన చేశారు. కేంద్ర జల్‌శక్తిశాఖ నిర్వహించిన సమావేశానికి రెండు సార్లు కేసీఆర్ వెళ్లారు. కృష్ణా జలాల్లో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలకు కేసీఆర్ అంగీకరించారు. కృష్ణా ట్రైబ్యునల్ తుదితీర్పు వచ్చే వరకు దీనికే కట్టుబడి ఉంటామని సంతకం పెట్టారు. వాటా పెంపు కోసం 2020లో మరోసారి అవకాశం వస్తే కూడా కేసీఆర్ ఉపయోగించుకోలేదు. నాకు నా ప్రాంతమే ముఖ్యం. ఆ తర్వాతే



పార్టీ అని నాడు బయటకొచ్చా. సీఎం కుర్చీలో ఉండి తెలంగాణకు అన్యాయం జరిగేలా ప్రవర్తించను. మేం అధికారంలోకి వచ్చాక రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ఆపించిన చరిత్ర నాది. దానిని ఆపితేనే చర్చలకు వస్తామని కండీషన్ పెట్టాం. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ఆగిందో లేదో.. నిజనిర్ధారణ కమిటీ ద్వారా విచారణ చేయించుకోవచ్చు. చచ్చినా.. బతికినా.. తెలంగాణ కోసమే. ఇదే నా కమిట్‌మెంట్. దేవుడి మీద ప్రమాణం చేసి చెబుతున్నా.. తెలంగాణకు అన్యాయం జరగనివ్వను' అని తెలంగాణ సీఎం రేవంత్ అన్నారు.

జలాలపై గందరగోళం వద్దు నదీ జలాల అంశంపై కేసీఆర్ ఇటీవల ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడిన విషయాన్ని రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. ఇలాంటి కీలకమైన విషయాలను పార్టీ కార్యాలయాల్లో మాట్లాడితే ప్రజల్లో గందరగోళం నెలకొంటుందని, అందుకే వాస్తవాలను చర్చించడానికి అసెంబ్లీలో ప్రత్యేక చర్చ పెట్టామని తెలిపారు. కృష్ణా, గోదావరి జలాలపై వేర్వేరుగా చర్చించి, ఒక స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వం భావిస్తోందని, ఇప్పటికే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కృష్ణా జలాలపై వాస్తవాలను సభ ముందు ఉంచారని రేవంత్ రెడ్డి వివరించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ, ఆ తర్వాత జరిగిన బీఆర్ఎస్ పాలనలోనూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు నీటి కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరిగిందని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు బిడ్డగా ఈ అన్యాయాన్ని సరిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ గారు ఇప్పటికైనా సభకు వచ్చి రాష్ట్రానికి ఉపయోగపడే సలహాలు ఇవ్వాలని రేవంత్ రెడ్డి కోరారు. అసెంబ్లీలో తెలంగాణ ప్రభుత్వం కీలక తీర్మానాలు చేసింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్రం అన్ని అనుమతులు ఇవ్వాలని తీర్మానం చేసింది. అలాగే గోదావరి జలాల తరలింపునకు ఏపీకి కేంద్రం ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని తీర్మానం చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి సైతం కృష్ణా జలాల అంశంపై సుదీర్ఘంగా చర్చించి గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కృష్ణా జలాల్లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని క్షుణ్ణంగా వివరించారు. అనంతరం 5వ తేదీ ఉదయం 10 గంటలకు అసెంబ్లీని వాయిదా వేశారు స్పీకర్.



## మండలి సమావేశాలనూ బహిష్కరించిన బీఆర్ఎస్

**హైదరాబాద్:** యూరియా కొరత, రైతుల సమస్యలపై తాము ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరించడాన్ని నిరసిస్తూ ప్రస్తుత మండలి సమావేశాలను బహిష్కరిస్తున్నట్లు శాసనమండలిలో భారాస పక్ష నేత మధుసూదనాచారి ప్రకటించారు. శనివారం తెలంగాణ ప్రైవేటు యూనివర్సిటీ బిల్లు-2026ను మంత్రి దామోదర్ రాజనర్సింహ మండలిలో ప్రవేశపెడుతుండగా భారాస సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము యూరియా కొరతపై వాయిదా తీర్మానం ఇచ్చామని, దీనిపై చర్చకు అనుమతివ్వాలని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. అయితే ఛైర్మన్ ఆ తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు ప్రకటించడంతో భారాస సభ్యులు పోడియం ముందుకు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలపై చర్చించాలని పట్టుబట్టారు. ఈ ఆందోళన మధ్యే ఎలాంటి చర్చ లేకుండా ప్రైవేటు యూనివర్సిటీల బిల్లును సభలో ఆమోదించారు. అనంతరం సభను ఛైర్మన్ వాయిదా వేశారు. భారాస సభ్యులు బయటకు వచ్చి ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద మధుసూదనాచారి, ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడారు.



## వందేభారత్ స్లీపర్ రైళ్లలో అధునాతన హంగులు

**దిల్లీ:** వందేభారత్ స్లీపర్ రైళ్లలో అధునాతన హంగులన్నింటినీ సమకూరుస్తున్నామని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. కోల్‌కతా-గువాహటి మార్గంలో త్వరలో పట్టాలెక్కబోతున్న బెర్తుల రైలును శనివారం న్యూదిల్లీ రైల్వేస్టేషన్లో ఆయన పరిశీలించారు. పెట్టెల్లో కలియతిరుగుతూ వాటిలో సౌకర్యాలను విలేకరులకు వివరించారు. వెడల్పైన ట్రే హోల్డర్, సర్దుబాటు చేసుకోగలిగేలా కిటికీలకు తెరలు, నీళ్లు బయటకు చిమ్మడానికి అవకాశమివ్వని లోతైన వాష్‌బేసిన్లు, చదువుకునేందుకు వీలుగా లైట్లు, హ్యాంగర్లు, మ్యాగజీన్లు ఉంచే ఏర్పాట్లు వంటివన్నీ వీటిలో కల్పించినట్లు చెప్పారు. 16 పెట్టెల రైళ్లలో ఒకదానిని గువాహటికి, రెండోదానికి కోల్‌కతాకు పంపిస్తామని తెలిపారు. సీట్ల సంఖ్యల్ని బ్రెయిలీ లిపిలోనూ రాయించినట్లు చెప్పారు. కుదుపుల్లేని రీతిలో రైలును మెరుగ్గా తీర్చిదిద్దామని, శబ్దం కూడా చాలా తక్కువగా వెలువడుతుందని, కవచ్ ఉంటుందని తెలిపారు. ఇన్‌ఫెక్షన్‌ను అడ్డుకునే సాంకేతికతను, అత్యవసర పరిస్థితుల్లో లోకోపైలట్‌తో మాట్లాడే ఏర్పాట్లను చేసినట్లు వివరించారు.

## కాలుష్య నియంత్రణలో ఇతర రాష్ట్రాల్ని మించాలి: సీఎస్

**హైదరాబాద్:** పర్యావరణ నిబంధనల అమలులో కట్టుదిట్టమైన వైఖరిని అవలంబిస్తూ..తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలను బెంచ్‌మార్క్‌గా తీసుకుని వాటికంటే మెరుగైన ఫలితాలు సాధించాలని కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) ఛైర్మన్, సీఎస్ రామకృష్ణారావు సూచించారు. 2025 జనవరి నుంచి నవంబరు వరకు పీసీబీ పనితీరుపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పరిశ్రమలకు అనుమతులు, నిబంధనల అమలు, వైద్య సంస్థల పర్యవేక్షణ, ప్రయోగశాలల బలోపేతం, విధానపరమైన సంస్కరణలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,274 పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించగా.. నిబంధనలు ఉల్లంఘించిన 149 పరిశ్రమల మూసివేతకు ఆదేశాలు జారీ చేసినట్లు పీసీబీ మెంబర్ సెక్రటరీ రవి సీఎస్‌కు వివరించారు. మరో 840 పరిశ్రమలకు కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన రెండు వైద్య సంస్థలపై చర్యలకు టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆదేశాలు జారీ చేసిందన్నారు. సమావేశంలో పీసీబీ పలు నిర్ణయాలు తీసుకుంది. జాతీయ గాలి నాణ్యత పర్యవేక్షణ కార్యక్రమం కింద లక్షకు మించి జనాభా ఉన్న పట్టణాల్లో కొత్తగా 40 గాలి నాణ్యత పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నది అందులో ఒకటి. హైదరాబాద్‌లో రియల్‌టైమ్ సమాచారం కోసం కొత్తగా 13 నిరంతర గాలి నాణ్యత పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నది మరో నిర్ణయం. సీఎఫ్ఈ, సీఎఫ్‌వో టాస్క్‌ఫోర్స్ నిపుణుల సలహా కమిటీల పదవీకాలాన్ని 2026 ఆగస్టు 31 వరకు పొడిగించారు.

## బీఆర్ఎస్ హయాంలో
# ఏపీ కృష్ణాజలాల జలదోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

కంద్రానికి ఫిర్యాదు చేశాం. పనులు నిలిపివేయించాం. 2024-25 సీజన్‌లో కృష్ణా జలాల్లో ఎక్కువ నీటిని వాడుకున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలకు అంగీకరించి కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారు. కృష్ణా నదీ పరివాహకం ప్రకారం మనకు అధిక వాటా రావాల్సి ఉంది. మేం వచ్చాక 550 టీఎంసీలు కావాలని వాదించాం. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు కింద ఇంకా 39 వేల ఎకరాల భూ సేకరణ పెండింగ్‌లో ఉందని ఉత్తమ్ తెలిపారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై కేవలం 30 శాతం నిధులు మాత్రమే ఖర్చు పెట్టారని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శాసనసభలో సాగునీటి ప్రాజెక్టులపై జరిగిన చర్చలో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం 2015లో జీవో ఇచ్చి 2022లో డీపీఆర్ సమర్పించిందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు అనుమతుల కోసం పెట్టిన శ్రద్ధ పాలమూరు ప్రాజెక్టుపై పెట్టలేదని విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టు వాటర్ సోర్సును మార్చడం వల్ల తీవ్ర నష్టం జరిగిందని పేర్కొన్నారు. కాళేశ్వరంపై రూ.90వేల కోట్లు ఖర్చు చేసినవారు.. పాలమూరుకు రూ.27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. పాలమూరు ప్రాజెక్టులో ఒక మోటార్ ఆన్ చేసి జాతికి అంకితం చేశామని ప్రకటించారు. కేసీఆర్ మోటార్ ఆన్ చేసిన తెల్లారే.. మళ్లీ ఆఫ్ చేశారు. కృష్ణా నది ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. గత ప్రభుత్వం రూ. 40 వేల కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై అధిక మోజు చూపి.. పాలమూరును నిర్లక్ష్యం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి రోజుకు 3 టీఎంసీలు తరలించేలా అంచనాలు పెంచుకుంటూ పోయారు. పాలమూరులో మాత్రం 1.5 నుంచి ఒక టీఎంసీకి తగ్గించారు. జూరాల నుంచి అయితే రోజుకు 2.8 టీఎంసీలు తరలించే అవకాశం ఉండేది. 60 రోజుల్లో 121 టీఎంసీలు తీసుకునేవాళ్లం. వాటర్ సోర్స్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడం వల్ల 68 టీఎంసీల స్థాయికి పడిపోయింది. ఆయకట్టు కాల్వల ప్రస్తావన, భూసేకరణ లేకుండానే డీపీఆర్ రూపొందించారు. ప్రాణహిత - చేవెళ్లను తుమ్మిడిహట్టి నుంచి మార్చి గోదావరిలో అన్యాయం చేశారు. జూరాల నుంచి అయితే 22 పంపుల ఏర్పాటుతో ప్రాజెక్టు పూర్తయ్యేది. 414 మీటర్ల లోతు నుంచి నీరు తీసుకొనేవాళ్లం. శ్రీశైలానికి మార్చడం వల్ల పంపుల సంఖ్య 37కి పెరిగింది. దాదాపు 560 మీటర్ల లోతు నుంచి నీటిని ఎత్తిపోయాల్సిన పరిస్థితి వచ్చిందని ఉత్తమ్ వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే కృష్ణా జలాలపై



తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని మంత్రి ఆరోపించారు. తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలుగా నీటి వాటాలపై బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సంతకాలు చేశారని గుర్తుచేశారు. అంతేకాదు తెలంగాణకు కేవలం 34 శాతం నీళ్లు సరిపోతాయని కేసీఆర్, హరీష్ రావులు అంగీకరించారని విమర్శించారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇరిగేషన్ పేరుతో రూ.1.80 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశారని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 299 టీఎంసీలకు ఒప్పుకుని తెలంగాణకు మరణశాసనం రాసినట్లయ్యిందని మంత్రి మండిపడ్డారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు 783 టీఎంసీలు కేటాయించాలంటూ ప్రభుత్వం బలమైన వాదనలు వినిపిస్తోందని స్పష్టం చేశారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో దాదాపు 73 శాతానికి పైగా భూభాగం తెలంగాణలోనే ఉందని పేర్కొన్నారు. పాలమూరు - రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు రూ.83 వేల కోట్లకు పైగా ఖర్చు అవుతోందన్నారు. ఇప్పటికీ మట్టి, కాంక్రీట్ పనులు మిగిలి ఉన్నాయన్నారు. మూడేళ్లలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టులో కేవలం 35 శాతం పనులే జరిగాయని విమర్శించారు. కుర్చీ వేసుకుని కూర్చుంటా అని కేసీఆర్ అన్నారని, ఆ కుర్చీ ఎక్కడ పోయిందో, కేసీఆర్ ఎక్కడికి వెళ్లారో చెప్పాలని ఎద్దేవా చేశారు. మూడేళ్లలో పూర్తి చేస్తానని చెప్పి ప్రజలను మోసం చేశారని మంత్రి ఆరోపించారు. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు రూ.41 వేల కోట్లు, గోదావరి బేసిన్ ప్రాజెక్టులకు రూ.1.20 లక్షల కోట్లను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు పెట్టిందని ఉత్తమ్ వెల్లడించారు.




## ఉపాధి హామీ పేరు మార్పు నిర్ణయాన్ని
# వెనక్కి తీసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం పేరు మార్పు నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకునే వరకు కాంగ్రెస్ పార్టీ.. కార్మికులు, రైతులు, పేదల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల హక్కులు, ఉపాధి భద్రత కోసం కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డా.జి.సంజీవరెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ పేదలకు గౌరవం, పని, సామాజిక, ఆర్థిక న్యాయాన్ని హామీ ఇవ్వడానికే గాంధీ.. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. కేంద్రంలోని భాజపా తీసుకొచ్చిన 'వీబీ-జీ రామ్ జీ చట్టం' అనేది గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. ధర్నాలో రాష్ట్ర కనీస వేతనాల సలహా బోర్డు ఛైర్మన్ జనక్ ప్రసాద్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆర్‌డీ చంద్రశేఖర్, నాగన్న గౌడ్, భాస్కర్‌రెడ్డి, షరీఫ్, ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ నేతలు సిద్ధి రాజు, రవి పాల్గొన్నారు.

## దర్యాప్తు సంస్థలకు కోర్టులు గడువు విధించడం అరుదు

### సర్వోన్నత న్యాయస్థానం స్పష్టీకరణ

**దిల్లీ:** దర్యాప్తు సంస్థలకు న్యాయస్థానాలు కాల పరిమితులు విధించడమనేది అన్ని సందర్భాల్లో జరగదని, అది అసాధారణ పరిస్థితుల్లో ఇచ్చే మినహాయింపు మాత్రమేనని సుప్రీంకోర్టు శనివారం పేర్కొంది. దర్యాప్తు ఆలస్యమైనప్పుడు తప్ప, గడువు అనేది అది ప్రతి కేసులో అనుసరించాల్సిన నియమం కాదని అత్యున్నత ధర్మాసనం స్పష్టంచేసింది. అలహాబాద్ హైకోర్టు జారీచేసిన ఓ ఉత్తర్వుపై విచారణ జరిపిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కె. సింగ్‌ల ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. నకిలీ పత్రాలతో ఆయుధ లైసెన్సు పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక కేసులో ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు 90 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేయాలని, అంతవరకు నిందితులపై ఎటువంటి కఠిన చర్యలు తీసుకోవద్దని అలహాబాద్ హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. "విచారణలో ఆలస్యం జరిగి పక్షపాతం పైచేయి సాధిస్తున్న సందర్భాల్లో మాత్రమే కోర్టులు దర్యాప్తు సంస్థలకు గడువు విధిస్తుంటాయి. దర్యాప్తులో జరిగే ఆలస్యం వల్ల ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతుందని భావించినప్పుడు మాత్రమే కోర్టులు జోక్యం చేసుకోవాలి. విచారణ ప్రారంభం కాకముందే కోర్టులు గడువు విధించవు. అలా చేయడం విచారణ సంస్థల పరిధిలోకి చొచ్చుకుపోవడమే అవుతుంది. నేర విచారణ అనేక అంశాలతో కూడుకొని ఉంటుంది. అందుకే న్యాయస్థానాలు విచారణ సంస్థలకు గణనీయ స్వేచ్ఛనిస్తాయి" అని ధర్మాసనం తెలిపింది.

## కేసీఆర్ రాజీతోనే 'పాలమూరు'కు అన్యాయం

### మంత్రి జూపల్లి



**హైదరాబాద్:** 'కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా జలాలపై హక్కు కోసం.. 511 టీఎంసీల వాటా కోసం పోరాడుతోంది. నాడు సీఎంగా ఉన్న కేసీఆర్ 299 టీఎంసీలకు ఎందుకు అంగీకరించారు? నీటి వాటాల విషయంలో కరాఖండిగా ఉండి ఉంటే హక్కులు మనకు వచ్చేవి. అధిక వాటా లభించేది' అని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కేసీఆర్ రాజీపడ్డారని.. అందుకే పాలమూరు ప్రాజెక్టుకు అన్యాయం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో శనివారం కృష్ణా జలాలపై జరిగిన చర్చలో జూపల్లి మాట్లాడారు. "2018 వరకు ఆ ప్రభుత్వంలో నేనున్నాను. నాడు కుర్చీ వేసుకొని ప్రాజెక్టు కట్టిస్తానని కేసీఆర్ చెప్పారు. చిత్తశుద్ధి కొరవడటంతోనే పాలమూరును మూలనపడేశారు. పనులు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేస్తున్నానంటూ కేసీఆర్ ప్రజల్ని మభ్యపెట్టారు. ప్రాజెక్టుకు రూ.87 వేల కోట్లు అవసరం. కానీ ఖర్చుచేసింది రూ.27 వేల కోట్లే. అయినా పనులు పూర్తయ్యాయని వంచించారు. జూరాల ప్రాజెక్టు వద్ద నీళ్లు లేవని.. శ్రీశైలం వద్దకు మార్చామని చెబుతున్నారు. కేవలం నిధులు ఆరగించేందుకు ప్రాజెక్టు స్థలాన్ని మార్చారు. అసెంబ్లీకి వస్తే బండారం బయటపడుతుందని, కేసీఆర్ ముఖం చాటేశారు" అని పేర్కొన్నారు.



## ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి: కేటీఆర్

**హైదరాబాద్:** తమకిచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన ఆటోడ్రైవర్లను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా వేల మంది ఆటోడ్రైవర్లను, ఆటో యూనియన్ల నేతలను కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే.. నిర్బంధాలు, అరెస్టులతో గొంతు నొక్కుతోంది. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలి. ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలు కొనసాగకుండా ఉండాలంటే.. వారికిచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి' అని కేటీఆర్ డిమాండ్ చేశారు?

# అడ్డగోలుగా హైదరాబాద్ విభజన

- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ తలసాని
- దమ్ముంటే హైదరాబాద్ పేరు మార్చాలని డిమాండ్



**హైదరాబాద్, జనవరి 3 :** హైదరాబాద్ మహా నగరాన్ని అడ్డగోలుగా విభజిస్తున్నారని అసెంబ్లీలో బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. గూగల్ మ్యాప్ ఆధారంగా హైదరాబాద్‌ను విభజించినట్లు ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేపీ వివేకానందతో కలిసి తలసాని మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలకు చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యం ఉందని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కానీ ఎంతో చరిత్ర ఉన్న సికింద్రాబాద్‌ను ఇష్టమొచ్చినట్లు విభజిస్తున్నారని మండిపడ్డారు. దీనికి వ్యతిరేకంగా ఈ నెల 17వ తేదీన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఇతరత్రా ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రకటించారు. మద్దతిచ్చే పార్టీలతో కలిసి నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. టెక్నికల్ స్టడీ లేకుండానే ప్రాంతాలను విభజిస్తున్నారని అన్నారు. జంట నగరాల ఉనికి లేకుండా కుట్ర చేస్తున్నారని తలసాని ఆరోపించారు. సికింద్రాబాద్ చరిత్రను, సంస్కృతిని నాశనం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. సికింద్రాబాద్ కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధైర్యం ఉంటే హైదరాబాద్ పేరు మార్చి చూడమని సీఎం రేవంత్ రెడ్డికి సవాలు విసిరారు. మహానగర విభజన పై కాంగ్రెస్ నాయకులకు కనీసం అవగాహన లేదని తలసాని విమర్శించారు. డివిజన్లను కూడా సరిగా విభజించలేదని అన్నారు. 24 నియోజకవర్గాలు ఉన్న మహానగరాన్ని విభజిస్తున్నప్పుడు ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకోలేదని తెలిపారు. ప్రజలకు పరిపాలన సౌలభ్యం కోసం బిఆర్ఎస్ హయాంలో 150 డివిజన్లు చేశామని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహానగరాన్ని ఇష్టమొచ్చినట్లు విభజిస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వ పనుల కోసం ప్రజలు నగరం మొత్తం తిరిగే పరిస్థితి తీసుకొస్తున్నారని తెలిపారు. దీనిపై చట్టపరంగా, న్యాయపరం గా పోరాడతామని తెలిపారు. అసెంబ్లీలో కూడా ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఎంతోమం ది ముఖ్య మంత్రులను, స్పీకర్లను చూశాం.. కానీ ఇలాంటి ముఖ్యమం త్రి, స్పీకర్‌ను చూడలేదని అన్నారు. స్పీకర్ కనీసం ప్రతిపక్ష సభ్యుల వైపు చూడటం లేదని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై పోరాడడం ప్రతిపక్ష పార్టీ పని అని.. కానీ ప్రతిపక్ష పార్టీని స్పీకర్ నిలువరిస్తున్నా రని అన్నారు. గంటన్నర పాటు రేవంత్ రెడ్డి బూతు పురాణం మాట్లా డుతున్న స్పీకర్ అడ్డు చెప్పలేదని మండిపడ్డారు. శాసనసభ వ్యవహా రాల మంత్రి శ్రీధర్ బాబు కూడా వత్తాసు పలికేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి మాటలకు చేతలకు పొంతనలేదని విమర్శించారు. అందరి అభిప్రాయాలు తీసుకుంటామని చెబుతూనే? అభిప్రాయం చెప్పకుండా అడ్డుపడుతున్నారని మండిపడ్డారు.



## పేదలకు అండగా నిలవడమే సర్కార్ లక్ష్యం

- అర్హులందరికీ గృహ జ్యోతి పథకం వర్తింపు
- అసెంబ్లీలో డిప్యూటి సిఎం భట్టి వెల్లడి

**హైదరాబాద్, జనవరి 3 :** పేద, బడుగు వర్గాలు ఆత్మగౌరవంతో జీవించడమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క తేల్చిచెప్పారు. పార్టీలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ గృహ జ్యోతి వర్తిస్తుందన్నారు. తెలంగాణ అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్రంలోని వివిధ అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇచ్చారు. ప్రధానంగా గృహ జ్యోతి పథకం, ఇంద్రమ్మ ఇళ్లు, వ్యవసాయ పథకాలు, సోయా కొనుగోలు వంటి ముఖ్య సమస్యలపై చర్చలు జరిగాయి. ముందుగా గృహ జ్యోతిపై ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, ఆది శ్రీనివాస్, నాగరాజు పలు ప్రశ్నలు సంధించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమాధానం ఇచ్చారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ గృహ జ్యోతి పథకం కొనసాగింపుపై సభలో డిప్యూటీ సీఎం స్పష్టతనిచ్చారు. కొత్త దరఖాస్తులు, మార్పులు ? చేర్పులకు ప్రజా పాలన కార్యాలయాల్లో అవకాశం ఉందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 52.82 లక్షల కుటుంబాలకు గృహ జ్యోతి ద్వారా ఉచిత విద్యుత్ లబ్ది చేకూరుతోందని తెలిపారు. గృహ జ్యోతి కోసం ఇప్పటి వరకు రూ.3,593 కోట్లకు పైగా ప్రభుత్వం చెల్లింపులు చేసిందని ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వ్యవసాయం రంగంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమాధానిమిస్తూ.. వ్యవసాయ రంగంలో ఆగిన పథకాలను పునరుద్దరణ చేపడుతున్నామని చెప్పారు. సోయాను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసినా, కేంద్రం కొనడం లేదని అన్నారు. ఈ విషయంపై బీజేపీ రాష్ట్ర నాయకులు కేంద్రంపై ఒత్తిడి తేవాలని మంత్రి సూచించారు.



## కాలుష్య పరిశ్రమలపై గట్టి చర్యలు

**మంత్రి కొండా సురేఖ వెల్లడి**

**హైదరాబాద్, జనవరి 3 :** చౌటుప్పల్ ప్రాంతంలో పలు ఫార్మా కంపెనీలు కాలుష్యకారకంగా మారుతున్న క్రమంలో నిబంధనలు ఉల్లంఘించిన పరిశ్రమలపై కాలుష్య నియంత్రణ మండలి గట్టి చర్యలు తీసుకుంటోందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. చౌటుప్పల్‌లో 8 పరిశ్రమలకు జరిమానా విధించామన్నారు. మండలిలో ప్రశ్నోత్తరాల సందర్భహంగా మాట్లాడుతూ.. భువనగిరి ప్రాంతంలో 18 పరిశ్రమలకు నోటీసులు ఇచ్చామని, ఎక్కడైనా పరిశ్రమలు వాతావరణాన్ని కలుషితం చేస్తుంటే తమకు ఫిర్యాదు చేయొచ్చని సురేఖ తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ టూరిజం అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. కొండగట్టు, వేములవాడ తదితర ఆలయాలను తీర్చిదిద్దుతున్నామని, మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయాన్ని తమ సర్కారు హయాంలో అభివృద్ధి చేయడం అదృష్టంగా భావిస్తున్నానని సురేఖ అన్నారు. చౌటుప్పల్‌లో పారిశ్రామిక కాలుష్యంపై సీపీఐ సభ్యుడు నెల్లికంటి సత్యం, కొండగట్టు ఆలయాభివృద్ధిపై భారాస సభ్యుడు ఎల్.రమణ ప్రశ్నించగా.. మంత్రి ఈ మేరకు స్పందించారు. ఇకపోతే ప్రత్యేక ప్రస్తావనల కింద సభ్యులు పలు ప్రశ్నలు అడిగారు. మత్స్య సహకార సంఘాలకు క్రమం తప్పకుండా ఎన్నికలు జరపాలని భారాస సభ్యుడు బండా ప్రకాశ్ కోరారు. యాదాద్రి ఆలయ నిర్మాణంలో అవినీతి జరిగిందని.. దీనిపై సిట్టింగ్ జడ్జి లేదా సభా సంఘంతో విచారణ జరిపించాలని తీన్మార్ మల్లన్న కోరారు. మోడల్ పాఠశాలల ఉపాధ్యాయులకు ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించాలని భాజపా సభ్యుడు మల్క కొమరయ్య విన్నవించారు. ఎంఐఎం సభ్యుడు ఎఫెండీ, భారాస సభ్యులు వాణీదేవి, నవీన్ తదితరులు అడిగిన ప్రశ్నలను నోట్ చేసుకున్నామని మంత్రి వివేక్ తెలిపారు.

# పాలమూరుపై ఇరు పార్టీల దొంగాట

**కేసీఆర్, రేవంత్ తీరులపై మండిపడ్డ అరుణ**



**హైదరాబాద్, జనవరి 3 :** పాలమూరు జిల్లాను కేసీఆర్, రేవంత్ రెడ్డిలు రాజకీయాల కోసం వాడుకుంటున్నారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ విమర్శించింది. పాలమూరు ప్రాంతానికి నీళ్లు ఇవ్వాలనే చిత్తశుద్ధి ఇద్దరికీ లేదు.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లతో ఒకరిపై ఒకరు నేపం నెట్టుకునే ప్రయత్నం తప్ప ఏం లేదు.. కేసీఆర్, రేవంత్ రెడ్డిలు ఇద్దరు పాలమూరు ప్రజలకు నష్టం చేసిన వారేనని మండిపడింది. జూరాల నుంచి నీళ్లు తీసుకోవాలని అనేక సార్లు చెప్పడం జరిగింది.. పాలమూరు రైతులతో ఆట ఆడుతున్నారని ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. ఇక, మాయ మాటలతో, మోసం చేసి.. మరోసారి అధికారంలోకి రావాలని కేసీఆర్ నాటకాలు ఆడుతున్నారని డీకే అరుణ ఆగ్రహం వ్యక్తం చేసారు. తప్పులను వాళ్ళపై నెట్టి తప్పించుకోవాలని కాంగ్రెస్ నాటకం ఆడుతుంది. ఇద్దరు ఆడుతున్న నాటకంలో పాలమూరు ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది.. పాలమూరు ప్రజలను పదేళ్లు కేసీఆర్ మోసం చేశారనే.. ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించారు.. జూరాల అప్రోచ్ అయితేనే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని చెప్పుకొచ్చింది. జూరాల నుంచి నీళ్లు తీసుకోవడానికి ఒక అడుగు కూడా ముందుకు పడటం లేదు.. డిండి ప్రాజెక్టుకి నీళ్ళు తీసుకెళ్లడంతో పాలమూరు ప్రజలకు అన్యాయం జరుగుతుందని బీజేపీ ఎంపీ అరుణ తెలిపింది. అయితే, పోటీలు పడి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్నారు.. దాని ఔట్ కమ్ ఏంటి? అని డీకే అరుణ ప్రశ్నించింది. డిండి ప్రాజెక్టుకి నీళు ్ళ తీసుకెళ్ళడాన్ని గతంలో పార్టీలకు అతీతంగా వ్యతిరేకించడం జరిగింది.. జూరాల నీళ్లు తీసుకుని పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్ ఆఖఖీ టెకాప్ చేయండి అని సూచించింది. ఇంతకు ముందు చేసిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ ను కల్వకుర్తిలో కలపండి లేదా నాగర్ కర్నూల్, నల్గొండ అని దాని పేరు పెట్టండి అని కోరింది. అందులో పాలమూరు- రంగారెడ్డి రెండు లేవు.. పాలమూరు ప్రాంత ఎమ్మెల్యేలు ఎందుకు నోర్లకు ఎ÷-లాస్టర్ వేసుకున్నారని అడిగింది. డిండికి నీళ్ళు తీసుకెళ్తుంటే నోర్లు మూసుకొని, చోద్యం చూస్తున్నారంటూ మండిపడింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పై ఎందుకు రివ్యూలు పెట్టడం లేదని డీకే అరుణ ప్రశ్నించారు. అలాగే, రివ్యూలకు నన్ను ఆహ్వానించడం లేదు.. కలిసి నిర్ణయం తీసుకుంటే ఏం ఇబ్బంది వచ్చిందని? ఎంపీ అరుణ అడిగింది. వెంటనే సీఎం రేవంత్ రెడ్డి పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్ పైనా ఇరిగేషన్ నిపుణులు, అధికారులు, ప్రజా ప్రతినిధులతో రివ్యూ పెట్టండి అని సూచించింది. వచ్చే మూడేళ్లలో పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసేలా సీఎం చొరవ తీసుకోవాలని కోరింది.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- గత పదేళ్లలో ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం
- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి వెల్లడి



**హైదరాబాద్, జనవరి 3 :** గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు చెల్లించిన బిల్లులలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అన్నారు. ప్రస్తుతం విచారణ జరుగుతోందని, విచారణ పూర్తయిన తర్వాత పెండింగ్ బిల్లులను చెల్లిస్తామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సమస్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో విమర్శలు చేశారు. తమ నియోజకవర్గాల్లో బిల్లులు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు త్వరగా చెల్లించాలని, టెక్నికల్ సమస్యలతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఇస్తున్న ఇండ్లతో పాటు అదనపు ఇండ్లు మంజూరు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోరారు. రాష్ట్రంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేసిందని.. తమ ప్రభుత్వంలో భేషజాలకు వెళ్లకుండా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మంది లబ్దిదారులను గుర్తించామని.. ఆగిపోయిన ఇళ్లకు నిధులిచ్చి పూర్తీ చేస్తున్నామని అన్నారు మంత్రి పొంగులేటి. గత పాలకులు పదేళ్లు కమిషన్ల కోసమే పనిచేశారని.. పదేళ్లలో ఇళ్ళు పూర్తీ చేసి ఉంటే పేదలకు ఇబ్బంది ఉండేది కాదని అన్నారు పొంగులేటి. పదేళ్లు కమిషన్లు తీసుకొని అరకొర ఇళు ్ళ ఇచ్చారని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక చెంచులందరికీ మొదటి విడతలోనే ఇళ్ళు మంజూరు చేశామని అన్నారు పొంగులేటి. గ్రామాల్లో ఎక్కడికి వెళ్లినా ఇందిరమ్మ ఇండ్లే కనిపిస్తున్నాయని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం స్థలాలు గుర్తిస్తున్నామని అన్నారు. పేదల ఆత్మగౌరవానికి సంబంధించిన ఇండ్ల నిర్మాణంలో రాజీపడం అని.. అర్హులందరికీ తప్పకుండా ఇండ్లు ఇస్తామని అన్నారు పొంగులేటి.

# బిసి కులాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**మండలిలో సభ్యులకు మంత్రి పొన్నం హామీ**



**హైదరాబాద్, జనవరి 3 :** కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులాల అభివృద్ధికి కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వివిధ వెనుకబడిన కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని, భూములు కూడా కేటాయించామని మండలిలో ప్రశ్నలకు సమాధానంగా తెలిపారు. గత ప్రభుత్వం కుల సంఘాలకు చేసిందేమీ లేదన్నారు. తమ సర్కారు సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని.. అధికార, రాజకీయ పదవుల్లో ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. త్వరలో అన్ని కార్పొరేషన్లను బలోపేతం చేస్తామని తెలిపారు. వెనుకబడినవర్గాల నైపుణ్యాభివృద్ధి పథకం తీసుకొస్తామని వెల్లడించారు. శాసనమండలిలో శుక్రవారం సభ్యులు వివిధ సమస్యలపై గళమెత్తారు. తొలుత ప్రశ్నోత్తరాల సమయం, అనంతరం ప్రత్యేక ప్రస్తావనలు.. ఆ తర్వాత వినతులు ఇచ్చేందుకు కూడా మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అవకాశం ఇచ్చారు. ఈ క్రమంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇచ్చారు. పలు సందేహాలను నివృత్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖలకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ ఏడాది బ్జడెట్లో బీసీ కార్పొరేషన్ భవనాలకు నిధులు కేటాయించాలని భారాస మండలిపక్ష నేత మధుసూదనాచారి కోరారు.



## సేంద్రియ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం : మంత్రి తుమ్మల

**హైదరాబాద్, జనవరి 3 :** రాష్ట్ర ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయానికి సముచిత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. మండలిలో ఆయన ప్రశ్నరలకు సమాధానం ఇస్తూ.. కేంద్రం సైతం ఈ సేద్యాన్ని ప్రోత్సహించేందుకు పలు పథకాలు తీసుకొచ్చిందని.. అయితే, గత భారాస సర్కారు హయాంలో కేంద్ర పథకాలను రాష్ట్రంలో అమలు చేయకపోవడం వల్ల తెలంగాణలో సేంద్రియ సాగు సరిగా జరగలేదన్నారు. భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం కింద గత సంవత్సరం రూ.95 కోట్లు చెల్లించామని, ఈ సారి పరిహారాన్ని త్వరలో రైతుల ఖాతాలో జమచేస్తామని తెలిపారు. రాష్ట్రంలో యాప్ ద్వారా రైతులందరికీ యూరియా సక్రమంగా అందుతోందని తుమ్మల వివరించారు. యాప్ ద్వారా చేపట్టిన పత్తి కొనుగోళ్లు విజయవంతమయ్యాయని, అదే తరహాలో యూరియాకూ యాప్ తెచ్చామన్నారు. భారాస సభ్యులు దాసోజు శ్రవణ్ కుమార్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఈ మేరకు బదులిచ్చారు.

## స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత

- సవరణ బిల్లును ఆమోదించిన తెలంగాణ అసెంబ్లీ
- ఆవశ్యకతను వివరించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్,జనవరి3 :** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. పంచాయతీరాజ్ చట్టంలోని 21వ సెక్షన్‌ను సవరిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు రాష్ట్ర అసెంబ్లీ శనివారం అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ సవరణ ద్వారా, గత కొన్ని దశాబ్దాలుగా అమలులో ఉన్న 'ఇద్దరు పిల్లల నిబంధన'ను ప్రభుత్వం పూర్తిగా తొలగించింది. అంటే, ఇకపై ఇద్దరి కంటే ఎక్కువ మంది సంతానం ఉన్న వ్యక్తులు కూడా సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ వంటి స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులుగా పోటీ చేయడానికి చట్టపరంగా అర్హత సాధించారు. ఈ బిల్లును పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అసెంబ్లీలో ప్రవేశపెడుతూ, మారుతున్న కాలానికి , రాష్ట్ర అభివృద్ధి పరిణామాలకు అనుగుణంగా జనాభా పెరుగుదల రేటును సమతుల్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గత ఎన్నికల సమయంలోనే ఈ నిబంధన తొలగింపును రాజకీయ పక్షాలతో పాటు సాధారణ ప్రజలు కూడా స్వాగతించారని ఆమె గుర్తు చేశారు. గతంలో ఈ నిబంధనపై ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయగా, ఇప్పుడు దానికి చట్టబద్ధత కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లును ఆమోదింపజేశారు. ఈ నిర్ణయం వల్ల గ్రామీణ స్థాయి రాజకీయాల్లో నాయకత్వం వహించాలని ఆశపడే ఎంతో మంది అభ్యర్థులకు ఉన్న ప్రధాన అడ్డంకి తొలగిపోయినట్లయింది. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## సమస్యలపై బిజెపి ఎమ్మెల్యే ప్రస్తావన

**చనాక కోరాట నిర్వాసిత సమస్యలపై పాయల శంకర్ వెల్లడి**

**హైదరాబాద్, జనవరి 3 :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మూడో రోజు శనివారం ప్రారంభం అయ్యాయి. సభ మొదలైన వెంటనే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ప్రశ్నోత్తరాల్లో భాగంగా బీజేపీ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా నీటిపారుదల ప్రాజెక్టులు, నిర్వాసిత రైతులకు పరిహారం, సాగునీటి సౌకర్యాలపై ప్రభుత్వాన్ని నిలదీశారు బీజేపీ ఎమ్మెల్యేలు. చనాక కోరాట ప్రాజెక్ట్ నిర్వాసిత రైతుల సమస్యలను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సభలో లేవనెత్తారు. చనాక కోరాట ప్రాజెక్ట్ నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయల విలువ చేసే భూములకు లక్షల రూపాయలే పరిహారం ఇస్తామన్నారని గుర్తుచేశారు. పదేళ్లు అయ్యిందన్నారు. నీళ్లు రాలేదని.. పరిహారం రాలేదని ఆదిలాబాద్ రైతులు పాదయాత్రగా హైదరాబాద్‌కు వచ్చారని తెలిపారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసి వెంటనే భూనిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. జైనథ్‌పూర్ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు కోరారు. నిధుల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని... ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రిని కలిసినా ÷ళ్లు కదలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రెండు మండలాల్లో సాగునీరు అందుతుందన్నారు. రైతులకు భారీ లాభం చేకూరుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ డిమాండ్ చేశారు. అలాగే ప్రిప్రీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కూడా వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు. నిజాంసాగర్ ప్రాజెక్టు కాలువల ఆధునీకరణకు రూ.2,000 కోట్లు కేటాయించాలని బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. రెండు వేల కోట్లు విడుదల చేస్తేనే నిజాంసాగర్ కాలువల ఆధునీకరణ సాధ్యమవుతుందని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, స్వరాష్ట్రంలోనూ నిజామాబాద్ జిల్లా తీవ్రంగా నష్టపోయిందని విమర్శించారు.

## ఉమ్మడి ఎపిలో కూడా ఇలా జరగలేదు

**స్పీకర్ తీరు బాధాకరమన్న గంగుల కమలాకర్**

**హైదరాబాద్,జనవరి3 :** ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇన్ని అవమానాలు ఎదుర్కోలేదని మాజీ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. కిరణ్‌కుమార్ రెడ్డి అప్పట్లో స్పీకర్‌గా ఉండే అని.. ఆ తర్వాత మనోహర్ అయ్యారని.. అయినా ఉద్యమ సమయంలో ఇలాంటి అవమానాలు జరగలేదని పేర్కొన్నారు. ఇక్కడ ఉన్న సభ్యులు అందరికీ సమాన హక్కులు ఉంటాయని అప్పటి స్పీకర్ మనోహర్ తమకు సమయం ఇచ్చేదని గుర్తుచేశారు. కానీ నిన్న అసెంబ్లీలో స్పీకర్ తీరు బాధాకరమని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇలా నిర్బంధం చేయలేదని.. మా గొంతు నొక్కలేదని గంగుల కమలాకర్ అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాలిపోయిన మోటార్లు, ఎండిపోయిన పంటలను అసెంబ్లీకి తీసుకొనిపోయామని గుర్తుచేశారు. పక్షపాత వైఖరితో ఉండకండి అని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు హితవు పలికారు. మీ వ్యవహర శైలిని మార్చుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రికి ఎలాంటి హక్కు ఉంటుందో అందే అందరు సభ్యులకు ఉంటుందని తెలిపారు. మా హక్కుల కోసమే మాట్లాడామని చెప్పారు. నిన్న అసెంబ్లీలో గిల్లికజ్జాలు పెట్టుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి చూశాడని గంగుల కమలాకర్ అన్నారు. మమ్మల్ని తిట్టేందుకే సభకు వచ్చాడని, కడుపునిండా తిట్టి వెళ్లాడని విమర్శించారు. ప్రశ్నోత్తరాల సమయంలో ముఖ్యమంత్రి రెండు గంటలు మాట్లాడతాడా అని ప్రశ్నించారు. అసెంబ్లీలో ఎజెండా కూడా పొద్దున రెండుగంటలకు ఇస్తారా అని మండిపడ్డారు. ఉపాధి హామీ పథకంపై మాట్లాడటానికి నేను, జగదీశ్ రెడ్డి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రిని విమర్శిస్తే మైక్ ఇవ్వమని చెప్పడమేంటని స్పీకర్‌పై గంగుల కమలాకర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రికి మేం భజన చేయాలా అని ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అసెంబ్లీ హుందాగా నడిచిందని తెలిపారు. గత స్పీకర్ ప్రతిపక్షాలకు తగినంత సమయం ఇచ్చేవారని గుర్తుచేశారు.

# పులులతోనే అడవులకు మనుగడ!



**పర్యావరణానికి పులులకు అవినాభావ సంబంధం ఉంది. అడవులను రక్షించుకోవాలంటే జంతువుల మనుగడ సాగాలి. జంతువులను కాపాడుకుంటేనే అడవులు పచ్చగా ఉంటాయి. ప్రకృతిని విధ్వంసం చేస్తున్న ప్రజలు అడవులను, కొండలను ధ్వంసం చేయడంతో అక్కడక్కడా ఉన్న పులులు నగరాల మీదకు వస్తున్నాయి. వాటిని చూసి వామ్మో పులి అంటూ పరుగెడుతున్నాయి. అడవులు చక్కగా ఉన్నంత కాలం అవి అక్కడే మనగుడ సాగించాయి. ఒక్క పులులే కాదు. సమస్య జంతుజాలంనకు అడవులే ఆవాసం. వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిది. అవి ఉంటేనే అడవులు, ప్రకృతి పచ్చగా ఉంటాయి. అలాంటి అడవులను యధేచ్ఛగా నరికేస్తున్నాం. కొండలను ధ్వంసం చేస్తున్నాం. దీంతో పులులు, చిరుతలు అడపాదడపా అడవుల శివారు గ్రామాల్లోకి వస్తున్నాయి. ఆహారం, నీరు కోసం తంటాలు పడుతున్నాయి. ఇప్పటికే కోతులు మనుషలను మించి గ్రామాల్లో సంచరిస్తున్నాయి. వీటిని తరిమికొట్టే చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఇవి ప్రజల ఆస్తులను, పంటలను ధ్వంసం చేస్తున్నాయి. మనుషులపై పడి కరుస్తున్నాయి.**

ఇకపోతే తెలుగు రాష్ట్రాల్లో ఈ మధ్య పులుల, చిరుతల సంచారం అడపదడపా కనిపిస్తోంది. నల్లమల, తిరుమల కొండలతో పాటు తెలంగాణ జిల్లాల్లోని అటవీ ప్రాంతంలో వీటి సంచారాం పెరిగింది. అటవీ అధికారుల లెక్కల ప్రకారం ఉభయ రాష్ట్రాల్లో పులుల సంచారం ఎక్కువైంది. ఓ వైపు మహారాష్ట్రలోని తాడోబా నుంచి, మరో వైపు నల్లమల నుంచి టైగర్లు కొత్త ఆవాసాలను వెతుక్కుంటూ సరిహద్దుల్లోని పలు జిల్లాల్లో తిరుగుతున్నాయి. తాడోబాలో పులుల సంతతి పెరిగిపోవడం.. అంతర్గత సంఘర్షణల వల్లే పులులు గోదావరి దాటి ఆసిఫాబాద్ జిల్లాలోకి అడుగుపెడుతున్నాయని, అక్కడి నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ మీదుగా జిల్లాల్లోకి ప్రవేశిస్తున్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. మహారాష్ట్ర లేదా ఛత్తీస్‌గఢ్ నుంచి ఓ పులి గోదావరి దాటి వచ్చినట్టు అనుమానిస్తున్నారు. పులుల సంచారం పెరగడంతో వీటు అప్రమత్తం అయ్యారు. స్థానికులు, వేటగాళ్ల నుంచి ముప్పు పొంచి ఉండడంతో ప్రత్యేక బృందాల ద్వారా గస్తీ కాస్తున్నారు. సోమశిల పరిధిలో ఓ పులి సంచారంతో యంగంపల్లితండా దాని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ వైపు నుంచి కృష్ణా నదిని ఈదుకుంటూ వచ్చిన ఓ పెద్దపులి తమ ప్రాంతంలో సంచరిస్తోందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గ్రామస్తుల సమాచారంతో అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టగా.. వ్యవసాయ పొలాల్లో పులి పాదముద్రలు కనిపించాయి. ఇకపోతే ఇటీవల గుర్తు తెలియని వాహనం ఢీకొని ప్రకాశం జిల్లాలో ఓ పులి మృత్యువాత పడింది.

సాధారణంగా వేసవి కాలంలో పులులు రిజర్వ్ ఫారెస్ట్ వైపు నుంచి అమ్రాబాద్ వైపు సంగమేశ్వర ప్రాంతం గుండా నదిని దాటుతుంటాయి. రెండు రాష్ట్రాల సరిహద్దులు దగ్గరగా ఉండటం, అక్కడ నీటి లోతు తక్కువగా ఉండడంతో పులులు కొల్లాపూర్ ఫారెస్ట్ లిమిట్స్‌లోని మార్గాన్ని ఎంచుకుంటాయని అధికారులు చెబుతున్నారు. గతంలో మహారాష్ట్ర నుంచి వచ్చే ఒకటో రెండో పులులను కాపాడేందుకే అష్టకష్టాలు పడ్డ ఫారెస్ట్ ఆఫీసర్లకు ఇప్పుడు పెద్దసంఖ్యలో వస్తున్న పులులను రక్షించడం పెను సవాల్‌గా మారింది. టైగర్ కారిడార్‌లోని అడవుల్లో ఇటీవలి కాలంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి పులులను ట్రాక్ చేస్తున్నారు. వాటి కదలికలను నిత్యం గమనించేందుకు టైగర్ ట్రాకర్లను సైతం నియమించారు. అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా వేటగాళ్ల రూపంలో పెద్దపులులు ప్రాణాలు కోల్పోతున్నాయి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 36 నుంచి 45 వరకు పులులు ఉన్నాయని చెబుతున్నారు. పులులు సంచరిస్తున్న అటవీ ప్రాంతాల్లో ఎలాంటి ఉచ్చులు బిగించకూడదని, పులి కదలికలు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మహారాష్ట్ర లోని తాడోబా టైగర్ రిజర్వ్ నుంచి పులులు తెలంగాణ వైపు క్యూ కడుతున్నాయి. అక్కడి టైగర్ రిజర్వ్‌లో పులుల సంఖ్య గణనీయంగా పెరిగిపోవడంతో కొత్త ఆవాసాలను వెతుక్కుంటూ ప్రాణహిత నది దాటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి.

ఈ సీజన్‌లో తాడోబా నుంచి సుమారు 3-4 పులులు రాష్ట్రంలోకి ప్రవేశించాయని, దీంతో కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ అటవీ ప్రాంతాలు ఇప్పుడు 'టైగర్ జోన్'గా మారిపోయిందని చెప్తున్నారు. కాగా ఈ పులుల్లో కొన్ని వెనక్కి వెళ్లిపోతుండగా, మరికొన్ని తిర్యాణి, పెంచికల్‌పేట రేంజ్‌లలో ఆవాసం కోసం ప్రయత్నిస్తున్నట్లు పేర్కొంటున్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోకి వస్తున్న పులులు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోకి ప్రవేశిస్తున్నాయి. ఇటీవల ఆసిఫాబాద్ నుంచి మొదలైన ఓ టైగర్ జర్నీ మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల మీదుగా సాగి సిద్దిపేట జిల్లాలోకి చేరింది. తొగుట, మిరుదొడ్డి, కొండాపూర్ మండలాల్లో పులి పాదముద్రలు కనిపించాయని, సిద్దిపేట పట్టణానికి దగ్గరగా కూడా వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. సిద్దిపేట జిల్లాలో పులి కనిపించడం ఇదే తొలిసారి. కొత్త ఆవాసం కోసమో.. తోడు కోసమో ఈ పులి దాదాపు 300 కిలోమీటర్లకుపైగా నడిచి ఉంటుందని ఆఫీసర్లు భావిస్తున్నారు. ఈ పులి రాష్ట్రంలోని 14 జిల్లాలో సంచరిస్తున్నట్లు గుర్తించారు. తాజాగా భూపాలపల్లి జిల్లాలోనూ పులి సంచారం కలవరపెడుతోంది. ఇటీవల భూపాలపల్లి అడవి నుంచి జకారం వద్ద రోడ్డు దాటుతుండగా ఓ అంబులెన్స్ డ్రైవర్ చూసినట్టు స్థానికులు చెబుతున్నారు. ములుగు,అబ్బాపూర్, జాకారం, పందికుంట బీట్లలో పులి పాదముద్రలను గుర్తించారు.



## కొండగట్టు అంజన్న.. నా ప్రాణదాత

### స్వామిని దర్శించుకున్న పవన్ కళ్యాణ్

**జగిత్యాల, జనవరి 3 :** కొండగట్టు అంజన్న దయ వల్లనే తాను ప్రాణాలతో బయటపడ్డానని, ఆయనంటే తనకు ఎన్నలేని భక్తి విశ్వాసాలని ఏపీ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామిని శనివారం పవన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రూ.35.19 కోట్ల తితిదే నిధులతో భక్తుల వసతి కోసం 96 గదుల ధర్మశాల, దీక్ష విరమణ మండప నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడారు. అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామంటే దేవుడి దయ ఉండాలి. కొండగట్టు నాకు పునర్జన్మనిచ్చింది. గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదం నుంచి నేను ఎలా బయటపడ్డానో ఇప్పటికీ ఆశ్చర్యం కలిగిస్తోంది. కొండగట్టు అంజన్నే నన్ను కాపాడారు. దీక్ష విరమణకు మండపం, సత్రం కావాలని గతంలో నన్ను కోరారు. తితిదే సభ్యులు, తెలంగాణ నాయకులు అందరి సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది' అని అన్నారు. కార్యక్రమంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంతోనే ఎక్కడి పనులు అక్కడే

- అయినా పట్టించుకోని సిఎం రేవంత్ రెడ్డి
- జాగృతి ప్రజాబాటలో కవిత విమర్శలు

**సూర్యాపేట, జనవరి 3 :** తెలంగాణలో అభివృద్ధి పనులు జరగడం లేదని.. అయిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంతోనే ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని ఆరోపణలు చేశారు. ఇవాళ(శనివారం) సూర్యాపేట జిల్లాలో జనం బాటలో భాగంగా కవిత పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు, రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈక్రమంలో ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు కవిత. సూర్యాపేట జిల్లాలో అభివృద్ధి పనులు ఎక్కడవి అక్కడే ఆగిపోయాయని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. జిల్లా అభివృద్ధిలో ఎలాంటి పాత్ర పోషించాలనే విషయంపై తాను దృష్టి పెట్టానని చెప్పుకొచ్చారు. అర్వపల్లి మండలంలోని కేజీబీవీ స్కూల్‌ను పరిశీలించానని తెలిపారు. గత ఏడాదిలో తుపాను వచ్చి ఈ స్కూల్ మునిగిపోతే కలెక్టర్ వచ్చి పరిశీలించారని.. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీశారు కవిత. రాష్ట్రంలో పంట కాల్వల మెయింటెనెన్స్ సరిగా లేదని అన్నారు. కాల్వల్లో కంప చెట్లు పెరిగాయని చెప్పుకొచ్చారు. నీళ్లు రాక అన్నదాతలు ఇబ్బంది



పడుతున్న పట్టించుకోరా అన్ని ÷ర్ అయ్యారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగానికి కనీసం నిధులు ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. కోదాడ వరకు నీళ్లు ఇచ్చే డిస్టిబ్యూటరీ కాల్వ 70 కిలోమీటర్లు ఉంటుందని... ఈ కాల్వను సరిగా మెయింటెనెన్స్ ఎందుకు చేయటం లేదని ప్రశ్నించారు. రుద్రమదేవి చెరువు పరిశీలించానని....700 ఎకరాల్లోని ఈ చెరువుకు గోదావరి నీళ్లు రావాల్సి ఉందని తెలిపారు. ఎస్సారెస్పీ స్టేజ్- 2లో భాగంగా నల్గొండ జిల్లాలో రిజర్వాయర్లు రావాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ ప్రాంత రైతాంగానికి మేలు జరిగేలా రిజర్వాయర్లు కట్టే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించాలని కవిత కోరారు.

## కూనంనేనివి దివాళాకోరు రాజకీయం

- మోడీపై వ్యక్తిగత విమర్శలపై మండిపాటు
- ఎక్స్ వేదికగా కిషన్ రెడ్డి విమర్శలు



**హైదరాబాద్, జనవరి 3 :** మోదీపై ఎమ్మెల్యే కూనంనేని వ్యాఖ్యలు రాజకీయ దివాళాకోరుతనాన్ని బయటపెట్టాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రాజకీయాల్లో హుందాతనం, పరిణతి అవసరమని చెప్పుకొచ్చారు. అంతేకానీ ప్రధానమంత్రిపై వ్యక్తిగత ధూషణలు, అర్థంలేని ఆరోపణలు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సీపీఐ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలు హేయమైనవని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికై, దేశాభివృద్ధికి అహోరాత్రులు కష్టపడుతూ, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ గౌరవాన్ని దార్శనిక నాయకుడు మోదీ పెంచుతున్నారని అన్నారు. అలాంటి వ్యక్తిపై ప్రజాప్రతినిధి అయిన కూనంనేని.. అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ట్వీట్ పెట్టారు కిషన్‌రెడ్డి. ప్రజలు అన్నింటినీ గమనిస్తుంటారనే విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలతో వారికి ప్రజాస్వామ్య విలువలపై, రాజకీయ వ్యవస్థపై ఏవగింపు కలుగుతోందని తెలిపారు. మోదీపై వ్యాఖ్యలకు గానూ కూనంనేని సాంబశివరావు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈ విషయంపై వెంటనే జోక్యం చేసుకుని మరెవరూ.. ఇలాంటి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయకుండా, సభా మర్యాదలు పాటించేలా చొరవ తీసుకోవాలని కిషన్‌రెడ్డి కోరారు.

## ఎన్నికలకు ముందే మహాయుతి దూకుడు

### పురపోరులో 68 స్థానాలు చిక్కించుకున్న కూటమి

**ముంబై, జనవరి 3 :** మహారాష్ట్ర పురపోరులో.. అధికార ప్రభుత్వం విజయకేతనం ఎగురవేసింది. పోలింగ్‌కు ముందే భాజపా నేతృత్వంలోని మహాయుతి కూటమి పలు స్థానాల్లో విజయం సాధించింది. ఎన్నికలు లేకుండానే 68 స్థానాల్లో ఈ కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ఉపసంహరణ పక్రియ శుక్రవారంతో ముగిసింది. ఈ క్రమంలో ప్రత్యర్థి పార్టీలకు చెందిన పలువురు అభ్యర్థులు పోటీ నుంచి వైదొలిగారు. దీంతో పలు స్థానాల్లో పోటీ లేకుండానే విజయం లభించింది. ఇందులో భాజపా 44, ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేన పార్టీకి 22, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ రెండు స్థానాలు గెలుచుకున్నాయి. ఈ ఏకగ్రీవ విజయాలపై అధికార ప్రభుత్వం ఆనందం వ్యక్తంచేసింది. ఈ విజయాలపై శివసేన పార్టీ (ఉద్ధవ్ ఠాక్రే) స్పందిస్తూ.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వంటి కేంద్ర సంస్థలను అడ్డుగా పెట్టుకొని ప్రతిపక్ష అభ్యర్థులను బెదిరించడం, లంచం ఇవ్వడంతో ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కారని ఆరోపించింది. ఇక, బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు 28 కార్పొరేషన్లకు జనవరి 15న ఎన్నికలు జరగనున్నాయి.

## అనంతలో ఘోర రోడ్డు ప్రమాదం

### రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి

**అనంతపురం, జనవరి 3 :** అతివేగం ఇద్దరిని బలిగొంది. మడకశిర మండలంలోని అగ్రంపల్లి సమీపాన గురువారం అర్ధరాత్రి ఎన్‌హెచ్ 544 ఈ జాతీయ రహదారిపై వ్యాన్‌ను బొలెరో అతివేగంతో ఢీకొట్టడంతో డ్రైవర్లు మహమ్మద్ రఫిక్ (32), రఘురామ్(19) దుర్మరణం చెందారు. రెండువాహనాలు నుజ్జయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మడకశిర పట్టణంలోని వడ్రపాళ్యం ప్రాంతానికి చెందిన రఘురామ్ బొలెరో వాహనంలో గుడిబండ సంత నుంచి హిందూపురానికి పశువులను తీసుకెళ్లాడు. అక్కడ దించేసి తిరుగు ప్రయాణమయ్యాడు. కర్ణాటకలోని శివమొగ్గకు చెందిన మహమ్మద్ రఫిక్ వ్యాన్‌లో పెనుకొండ సమీపంలోని కియ పరిశ్రమకు సంబంధించిన సామగ్రిని పుణెకి తీసుకెళ్లాడు. అక్కడ దించేసి కియకి తిరుగి వస్తున్నాడు. అగ్రంపల్లి వద్ద జాతీయ రహదారిపై వ్యాన్‌ను బొలెరో వాహనం అతివేగంతో ఎదురుగా వెళ్లి ఢీకొంది. ఇరు వాహనాల డ్రైవర్లు అక్కడికక్కడే మృతిచెందారు. బొలెరో వాహనంలోని భువనేశ్వర్ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. రఘురామ్ తండ్రి శివానంద్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రఘురామ్‌కు వివాహం కాలేదు. మహమ్మద్ రఫిక్‌కు భార్య, కుమారుడు ఉన్నారు.

## మెదక్ జిల్లాలో దారుణ ఘటన

### ప్రియుడి మోజులో భర్త దారుణ హత్య

**మెదక్, జనవరి 3 :** మెదక్ జిల్లా శివంపేట మండలం తిమ్మాపూర్ లో దారుణం చోటు చేసుకుంది. వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది భార్య.. మద్యం మత్తులో భర్త స్వామి (35) చెరువులో పడి చనిపోయినట్టుగా నమ్మించేందుకు ప్రయత్నం చేసింది. ఇక, పోలీసుల విచారణలో భార్య మౌనిక(28) అక్రమ సంబంధం బాగోతం బయటపడింది. అయితే, 12 ఏళ్ల క్రితం స్వామి, మౌనికలకు పెళ్లి జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇక, తనకంటే తక్కువ వయస్సున్న సంపత్(23) అనే యువకుడితో ఆమె వివాహేతర సంబంధం పెట్టుకుంది. విషయం తెలియడంతో పంచాయితీ పెడతానని భర్త హెచ్చరించాడు. దీంతో ఎలాగైనా భర్తను చంపేయాలని మౌనిక ఎ÷-లాన్ వేసింది. గత నెల డిసెంబర్ 22వ తేదీన మద్యం తాగి ఇంటికి వచ్చి నిద్రపోయిన స్వామి.. ఇదే అదనుగా భావించి ప్రియుడిని ఇంటికి పిలిచి ఇద్దరు కలిసి భర్త గొంతు నొక్కి చంపేశారు. ఇక, భర్త స్వామి చనిపోయిన తర్వాత బైక్ పై మృతదేహాన్ని తీసుకెళ్లి నెరేళ్లకుంటలో పడేసి మద్యం మత్తులో పడి చనిపోయినట్టు కిలేడి మౌనిక నమ్మించింది. అయితే, భార్య ప్రవర్తనలో మార్పు రావడంతో తమ స్టైల్లో పోలీసులు విచారించగా నేరం ఒప్పుకుంది. దీంతో మౌనికతో పాటు ఆమె ప్రియుడు సంపత్ ని అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించారు పోలీసులు.

## అసెంబ్లీలో స్పీకర్ పక్షపాత వైఖరి

- సిఎం రేవంత్ తీరు అధ్వాన్నం
- అందుకు అసెంబ్లీకి వెళ్లడం లేదు
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



**హైదరాబాద్, జనవరి 3 :** అసెంబ్లీలో స్పీకర్ పక్షపాత వైఖరిని తెలంగాణ సమాజం గమనించిందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో సుదీర్ఘ ప్రసంగం చేయడం శాసనసభ చరిత్రలో ఇప్పటివరకు లేదని తెలిపారు. ప్రశ్నోత్తరాల సమయంలో సీఎం రేవంత్ గంటన్నర పాటు మాట్లాడడం శాసనసభ నిబంధనకు విరుద్ధమని తెలిపారు. రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందని చెబుతూనే.. మూసీ ప్రక్షాళనకు వేల కోట్లు ఎట్లా ఖర్చు చేస్తారని హరీశ్‌రావు అడిగారని.. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పకుండా అడ్డగోలుగా మాట్లాడారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి గంటన్నర పాటు మా సభ్యులపై అసభ్యంగా మాట్లాడటం దారుణమని వేముల ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. స్పీకర్ అడ్డు చెప్పకుండా.. ప్రతిపక్షాలకు అవకాశం కల్పించకుండా చేయడం అన్యాయమని అన్నారు. ప్రతిపక్షానికి కనీసం మాట్లాడటానికి అవకాశం ఇవ్వడం లేదని తెలిపారు. ముఖ్యమంత్రి తప్పులను ఎత్తిచూపేందుకు మైక్ ఇవ్వడం లేదని అన్నారు. ముఖ్యమంత్రిని విమర్శిస్తే మైక్ ఇవ్వను అని స్వయంగా స్పీకర్ చెప్పడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. మాకు మైక్ ఇవ్వనప్పుడు అసెంబ్లీకి వెళ్లి ఏం లాభమని ప్రశ్నించారు. బీఆర్ఎస్ సభ్యులకు మాట్లాడేందుకు కనీసం అవకాశం కల్పించడం లేదని.. అందుకే బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించిందని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని తెలంగాణ సమాజం అర్థం చేసుకోవాలని కోరారు. తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 2016లో శాసనసభలో కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని వేముల ప్రశాంత్ రెడ్డి గుర్తుచేశారు. అప్పుడు కాంగ్రెస్ సభ్యులు శాసనసభను బహిష్కరించారని తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడం శాసనసభ నిబంధనలకు విరుద్ధం అని కాంగ్రెస్ ప్రతిపక్షంగా ఉన్నప్పుడు స్వయంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క స్పీకర్ కు ఉత్తరం రాసి, సంతకాలు చేశారని పేర్కొన్నారు. కానీ ఇప్పుడు వాళ్లే ప్రజెంటేషన్ ఇస్తున్నారని.. ఇది కాంగ్రెస్ ద్వంద్వనీతికి నిదర్శనమని ఆరోపించారు. అప్పుడు టీడీపీలో ఉన్న రేవంత్ రెడ్డి కూడా పీపీటీని వ్యతిరేకించారని.. ప్రస్తుతం కాంగ్రెస్ మళ్లీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు సిద్ధమైందని అన్నారు. బీఆర్ఎస్ కు కూడా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు అవకాశం కల్పించాలని స్పీకర్ కు ఉత్తరం రాశామని తెలిపారు. బీఆర్ఎస్‌కు పీపీటీ అవకాశం కల్పిస్తే సభకు వెళ్తామని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా అసెంబ్లీలో ఇన్ని అవమానాలు జరగలేదని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ వాదాన్ని కూడా అసెంబ్లీలో గట్టిగా చెప్పామని తెలిపారు. గతంలో శాసనసభకు కాలిన మోటార్లు, ఎండిన వరి పైరులు తీసుకెళ్లామని గుర్తుచేశారు.

## అసెంబ్లీ వద్ద సోయా రైతుల ఆందోళన

### అడ్డుకుని తరలించిన పోలీసులు

**హైదరాబాద్, జనవరి 3 :** అసెంబ్లీ వద్ద అదిలాబాద్ రైతులు హడావుడి చేశారు. అసెంబ్లీ లోపలికి వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. అధిక వర్షపాతం కారణంగా సోయా బీన్ పంటకు నష్టం వాటిల్లింది. రంగు మారిందని సోయా బీన్ పంటను కొనుగోలు చేయడం లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా రైతులం మంత్రిని కలవడానికి వచ్చామని పేర్కొన్నారు. కేవలం ఐదుగురు రైతులను మాత్రమే అనుమతి ఇస్తామని పోలీసులు తేల్చి చెప్పారు. అయితే, 2,80,000 క్వింటాల్ కి పైగా సోయా బిన్ పంటను కొనుగోలు చేయాల్సి ఉంది.. రైతుల దగ్గర నిలువ ఉన్న పంటను రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. 24,000 మంది రైతులు 72 ఎకరాలలో సోయా బీన్ సాగు చేశారు. 4,32,000 క్వింటాల దిగుబడి వస్తుందని అంచనా కానీ అంతకంటే ఎక్కువనే వచ్చింది. 6, 280 మంది రైతుల వద్ద 1,64,000 క్వింటల్ పంట ప్రభుత్వం కొనుగోలు చేసింది. వచ్చిన రైతులందరినీ పంపిస్తేనే లోపలికి వెళ్తామని రైతులు తెలిపారు. పోలీసులు అనుమతించకపోవడంతో అక్కడి నుంచి వెనుదిరిగారు.

## డ్రగ్స్ తీసుకున్న ఎమ్మెల్యే కుమారుడు

### పోలీసు తనిఖీల్లో పట్టుబడ్డ సుధీర్ రెడ్డి



**హైదరాబాద్, జనవరి 3 :** నగరంలోని నానక్‌రామ్‌గూడలో శనివారం ఈగల్ టీమ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. ఈ సోదాల్లో బీజేపీ జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుమారుడు సుధీర్‌రెడ్డి డ్రగ్స్ తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో సుధీర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని చెక్ చేశారు. ఈ పరిశీలనలో సుధీర్‌రెడ్డికి డ్రగ్స్ పాజిటివ్ వచ్చింది. వెంటనే ఆయనని అరెస్ట్ చేసి, డీ-అడిక్షన్ సెంటర్‌కి తరలించారు. సుధీర్‌రెడ్డితో పాటు మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం సుధీర్‌రెడ్డిని పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. ఆయనకు డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి, ఎవరు సరఫరా చేశారనే కోణంలో పోలీసులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సుధీర్‌రెడ్డి డ్రగ్స్ కేసు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారింది.



## గోల్డెన్ రాక్స్ కాంట్రాక్షన్ కంపెనీ ద్వారా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

**బీర్కూర్, రాజముద్ర న్యూస్ :** బీర్కూర్ మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనిధి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్లు, ఉపాదా హామీ పథకాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనిధి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకొనే లబ్ధిదారులకు గోల్డెన్ రాక్స్ కాంట్రాక్షన్ కంపెనీ ద్వారా లబ్ధిదారుల ఒప్పందంతో ఉచితంగా ఇండ్లు నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు. 400 ఫీట్లు లోపు ఉన్న ఇందిరమ్మ ఇండ్లకు వర్తిస్తుందన్నారు, 400 ఫీట్లు దాటిన ఇండ్లకు, ఫీట్ కు 125 రూపాయల చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఉపాధి హామీ ద్వారా వ్యవసాయ రంగాల కు సంబంధించిన, కోళ్ల ఫారం, గేదెల షెడ్లు, మొదలగునవి సబ్సిడీ ద్వారా నిర్మించుకోవచ్చు అన్నారు. సర్పంచ్ ఎన్నికలో సర్పంచ్‌గా గెలిచి, ఓడిన అభ్యర్థులు వారి యొక్క ఖర్చు వివరాలు తెలియజేయాలన్నారు. ఖర్చు వివరాలు తెలియని పక్షంలో చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. అనంతరం నూతనంగా గెలిచిన సర్పంచ్ లకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనిధి, స్పెషల్ ఆఫీసర్ మోహన్ రెడ్డి, ఎంపీ ఓ మెహబూబ్, సూపరిడెంట్ భాను ప్రకాష్, ఏపీవో అక్మల్, పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## అజయ్ తండాలో మిషన్ భగీరథ పనుల పరిశీలన

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శుక్రవారం నేలకొండపల్లి మండలం లో అజయ్ తండా గ్రామ పంచాయతీలో పర్యటించారు. డివిజనల్ ఇంజనీర్ ఓంప్రకాష్, అసిస్టెంట్ ఇంజనీర్ లక్ష్మీ భవాని గ్రామంలోని మిషన్ భగీరథ నీటి సరఫరా తీరును, పైప్‌లైన్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలోని వాటర్ ట్యాంకులను పరిశీలించి నీటి నాణ్యతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అజయ్ తండా కొత్త కాలనీకి ప్రత్యేకంగా నీటి పైప్‌లైన్ వేయాలని సర్పంచ్ తేజావత్ శివాజీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన అధికారులు, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించి త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇబ్రహీం, ప్రధానోపాధ్యాయులు రామారావు, సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



## తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం

### వంగర సర్పంచ్ గజ్జల సృజన రమేష్

**భీమదేవరపల్లి, జనవరి 3, రాజముద్ర న్యూస్ :** తాగునీటి సమస్య ను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వంగర గ్రామ సర్పంచ్ గజ్జల సృజనా రమేష్ తెలిపారు. భీమదేవరపల్లి మండలం వంగర గ్రామ ప్రజలకు శుద్ధి చేసిన త్రాగునీరు అందించే లక్ష్యంతో బాల వికాస వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ ఆధ్వర్యంలో స్థానిక పీవీ నరసింహారావు విగ్రహం వద్ద శనివారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాలవికాస ఫెడరేషన్ అధ్యక్షులు కెడం లింగమూర్తి హాజరై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన త్రాగునీటి అవసరం ఎంతో ముఖ్యమన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం బాల వికాస సంస్థ ద్వారా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామ పంచాయతీ సహకారంతో ఈ ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేస్తామని పేర్కొన్నారు ఈ సందర్భంగా సర్పంచ్ గజ్జల సృజన రమేష్ మాట్లాడుతూ..వంగర గ్రామంలో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే తమ లక్ష్యమని తెలిపారు. బాల వికాస సంస్థ సహకారంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు కావడం గ్రామానికి ఎంతో మేలు చేస్తుందని, గ్రామ ప్రజల కు నాణ్యమైన త్రాగునీరు అందుబాటులోకి వస్తుందని అన్నారు. గ్రామాభివృద్ధికి ఇలాంటి సేవా సంస్థల సహకారం అవసరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ ఉల్లాల రమేష్, వార్డ్ సభ్యులు గజ్జల రమేష్ ,రఘునాయకుల మహేష్, శ్రీరామోజు మొండయ్య మారం సతీష్, స్థానికులు సుహాసిని, ఉల్లాల ఇందిరా, కొండ తిరుపతి, గిద్ద శ్రీనివాస్, వలి, షేక్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**వాజేడు,రాజసముద్ర న్యూస్:** ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు స్త్రీల అభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళ ఉద్యమకారుణి,స్త్రీల బానిసత్వ విముక్తి కోసం అహర్నిశల శ్రమించిన నాయకి గొప్ప రచయిత్రి సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు పేరూరు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల నందు శనివారం జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ప్రాథమిక పాఠశాల మహిళా ఉపాధ్యాయురాలులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిద్దబోయిన భద్రాచలం (బద్రి), డిప్యూటీ వార్డెన్ ఈశ్వరరావు, ఉపాధ్యాయులు నర్సింగరావు,నారాయణ,బాలాజీ, నాగమణి, పార్వతి,లక్ష్మి, సుమలత,విద్యార్థులు పాల్గొన్నారు.

# పల్లె రోడ్ల పథకానికి పాతికేళ్లు

- 25 ఏళ్లు పూర్తి చేసుకున్న పీఎం గ్రామ సడక్ యోజన
- నాలుగు దశల్లో 7.87 లక్షల కి.మీ. రోడ్ల నిర్మాణం
- గ్రామాల అభివృద్ధికి బాటలు వేసిన పథకం
- సాంకేతికత వినియోగంతో పక్కాగా రోడ్ల నిర్మాణం
- రోడ్ల నాణ్యత పరిశీలనకు మూడంచెల వ్యవస్థ

**దేశంలో గ్రామాల అభివృద్ధికి బాటలు వేసిన ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన(పీఎంజీఎస్‌వై) పథకం ప్రారంభమై 25 ఏళ్లు పూర్తి చేసుకుంది. స్వాతంత్ర్య భారత చరిత్రలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చేపట్టిన పథకాల్లో ఇది ప్రధానమైనది. ఈ పథకం కింద గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించడంతో ప్రజలకు విద్య, వైద్యం, ఇతర సౌకర్యాలు చేరువయ్యాయి. వారు పేదరికం నుంచి బయటపడేందుకు, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఈ పథకం దోహదపడుతోంది. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద ఇప్పటివరకు 8,25,114 కిలోమీటర్ల రోడ్లు మంజూరు కాగా 7,87,520 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం పూర్తయ్యింది.**



### తొలి దశలో 1.63 లక్షల గ్రామాలకు రోడ్లు

రోడ్డు సదుపాయం లేని 1,63,339 గ్రామీణ నివాస ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా 2000లో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన ప్రారంభమైంది. తొలి దశలో రూ.2,38,953.43 కోట్ల వ్యయంతో 6,25,095 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం జరిగింది. దీంతో ఈ గ్రామాలను వ్యవసాయ మార్కెట్‌లు, విద్యా సంస్థలు, ఆరోగ్య సదుపాయాలతో ఈ పథకం అనుసంధానించింది.

### రెండో దశలో రోడ్ల బలోపేతం:

గ్రామీణ రోడ్డు వ్యవస్థను బలోపేతం చేయడం కోసం 2013లో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన రెండో దశ ప్రారంభమైంది. ఈ దశలో రూ.28,656.55 కోట్ల వ్యయంతో 49,084 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం జరిగింది. గ్రామాలకు రోడ్డు సౌకర్యం మెరుగుపర్చడం ద్వారా గ్రామీణ ఆర్థిక అభివృద్ధికి ఈ పథకం దోహదపడింది.

### మూడో దశలో లక్ష కిలోమీటర్ల రోడ్ల ఆధునీకీకరణ:

కేంద్రం 2019లో పీఎంజీఎస్‌వై మూడో దశ ప్రారంభించింది. గ్రామాలతో వ్యవసాయ మార్కెట్లు, ఉన్నత పాఠశాలలు, ఆసుపత్రులు వంటి కీలక సామాజిక, ఆర్థిక సంస్థల అనుసంధానాన్ని బలోపేతం చేసేందుకు 1.25 లక్షల కిలోమీటర్ల ప్రధాన గ్రామీణ రహదారులను ఆధునికీకరించడం ఈ దశ లక్ష్యం. ఇప్పటివరకు రూ.68,658.68 కోట్లు ఖర్చు చేసి 1,01,623 కిలోమీటర్ల రోడ్లను అప్‌గ్రేడ్ చేసింది.

### నాలుగో దశలో 25 వేల గ్రామాలకు రోడ్లు

ఇప్పటివరకు రోడ్డు సదుపాయం లేని 25 వేల గ్రామీణ నివాస ప్రాంతాలకు 62,500 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు కేంద్రం రూ.70,125 కోట్ల వ్యయంతో 2024లో పీఎంజీఎస్‌వై నాలుగో దశ ప్రారంభించింది. 2024–25 నుంచి 2028–29 ఆర్థిక సంవత్సరాల మధ్య ఈ దశ అమలవుతుంది. మైదాన ప్రాంతాల్లో 500 కంటే ఎక్కువ జనాభా ఉన్న చిన్న గ్రామాలకు ఈ దశలో రోడ్ల నిర్మాణం జరుగుతోంది.

### వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో రోడ్లు

దేశంలో వామపక్ష తీవ్రవాద ప్రభావం ఉన్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా తొమ్మిది రాష్ట్రాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు 2016లో కేంద్రం రోడ్ కనెక్టివిటీ ప్రాజెక్ట్ ఫర్ లెఫ్ట్ వింగ్ ఎక్స్‌ట్రిమిజం ఎఫెక్టెడ్ ఏరియాస్(ఆర్‌సీపీఎల్‌డబ్ల్యూఈఏ) పథకాన్ని ప్రారంభించింది. ఇక్కడి ప్రజలకు విద్య, వైద్య సేవలను మెరుగుపర్చడం, భద్రతా కార్యకలాపాల ను బలోపేతం చేయడం ఈ పథకం లక్ష్యాలు. ఇందులో భాగంగా ఇప్పటివరకు రూ.9,019.73 కోట్లతో 9,768 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం జరిగింది.

### నాణ్యత పరిశీలనకు మూడంచెల వ్యవస్థ

గ్రామాల్లో చేపట్టే రోడ్డు పనుల నాణ్యతపై కేంద్రం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. పనుల నాణ్యత పరిశీలన, పర్యవేక్షణకు మూడంచెల వ్యవస్థను ఏర్పాటుచేసింది. మొదటి దశలో ఎగ్జిక్యూటింగ్ ఏజెన్సీలు నాణ్యత పరీక్షలు చేస్తాయి. రెండో దశలో రాష్ట్ర క్వాలిటీ మానిటర్లు (ఎస్‌క్యూఎం) లు పనుల తనిఖీ చేస్తారు.

### సాంకేతికత వినియోగంతో సమర్థవంతంగా పర్యవేక్షణ

రోడ్డు పనులను పర్యవేక్షించేందుకు కేంద్రం అధునాతన సాంకేతికతను వినియోగిస్తోంది. పనుల పరోగతి, నాణ్యతను నిరంతరం పర్యవేక్షించేందుకు ఆన్‌లైన్ మేనేజ్‌మెంట్, మానిటరింగ్ అండ్ అకౌంటింగ్ సిస్టమ్(ఓఎంఎంఏఎస్) పోర్టల్‌ను ప్రారంభించింది. నిర్మాణం తర్వాత ఐదేళ్ల పాటు కాంట్రాక్టర్లు రోడ్డు నిర్వహణ బాధ్యతలు చూస్తారు. ఈ సమయంలో రోడ్డు నిర్వహణను పర్యవేక్షించేందుకు ఈ–మార్గ్ అనే ఆన్‌లైన్ వ్యవస్థను ఏర్పాటుచేసింది. రోడ్డు పనులకు వాడే అన్ని వాహనాలు, యంత్రాలకు జీపీఎస్ అమర్చడం తప్పనిసరి చేసింది. ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్(ఐఆర్‌సీ) ప్రమాణాల ప్రకారం రోడ్లు నిర్మించడం ద్వారా పనుల్లో నాణ్యత ఉండేలా చూస్తోంది.





## మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధం కావాలి

### అధికారులను ఆదేశించిన జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** మున్సిపల్ ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించేలా అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. షెడ్యూల్ వెలువడిన వెంటనే ఎన్నికలను సమ–ర్ధవంతంగా నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఒక్కో వార్డు వారీగా ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలని అన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా ముసాయిదా జాబితాను ప్రదర్శించాలని, అభ్యంతరాలను స్వీకరించి సకాలంలో వాటిని పరిష్కరించాలని, జనవరి 10వ తేదీన తుది ఓటరు జాబితా వెలువరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి, సదుపాయాలను పరిశీలించాలని అన్నారు. అవసరమైన చోట కనీస సౌకర్యాలు కల్పించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీరు, టాయిలెట్స్, ఫర్నీచర్, విద్యుత్, లైటింగ్, ర్యాంపు వంటి వసతులు ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన సిబ్బందిని గుర్తించి, శిక్షణ తరగతుల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా అప్రమత్తతతో ఎన్నికల విధులను నిర్వర్తించాలని అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వివిధ శాఖల జిల్లా అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించడం జరిగిందని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ మధు మోహన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, సీఈఓ చందర్, ఎల్లారెడ్డి, కామారెడ్డి ఆర్డీవోలు పార్థ సింహ రెడ్డి, వీణ, కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్కుంద మున్సిపల్ కమిషనర్లు టౌన్ ప్లానింగ్ అధికారులు, మేనేజర్లు,రెవెన్యూ అధికారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజనుల ఇళ్లను కూల్చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

### సిపిఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్, మొయినాబాద్ కార్యదర్శి ప్రవీణ్ కుమార్


**మొయినాబాద్, రాజముద్ర న్యూస్:** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్ద మంగళారం రెవెన్యూలో సర్వేనెంబర్ 210, 211,212 లలో గిరిజనులు న్యాయబద్ధంగా, చట్ట బద్ధంగా ప్లాట్లు కొనుగోలు చేసి అన్ని అనుమతులతో ఇల్లు నిర్మించుకున్నారు. కొంతమంది రాజకీయ పెద్దల, రియల్ ఎస్టేట్ బ్రోకర్ల ప్రోత్బలంతో మున్సిపల్ అధికారులు గిరిజనుల ఇళ్లను కూల్చివేయడాన్ని సిపిఎం పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. సిపిఎం మొయినాబాద్ మండల కార్యదర్శి సిహెచ్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారులు కూల్చేసిన ఇళ్లను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ.... 111 జీవో సాకుతో పేదల ఇళ్లను కూల్చి వేస్తున్నారని ధనికుల ఫామ్ హౌస్లు, రిసార్ట్స్, కమర్షియల్ బిల్డింగ్స్ జోలికి వెళ్లకుండా పేదలపై ప్రతాపం చూపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ల కూల్చివేతకు కారణమైన రియల్ ఎస్టేట్ బ్రోకర్స్ రాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, జి శ్రీనివాస రాజు, డి సురేష్ రెడ్డి లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి



అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇండ్లు కూల్చేసిన మున్సిపల్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని, గిరిజనుల తరఫున సిపిఎం పార్టీ న్యాయ పోరాటం చేస్తుందని, వారికి న్యాయం జరిగేంత వరకు వారికి అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మొయినాబాద్ మండల నాయకులు మహేందర్, రాజేందర్, చెన్నయ్య, నరసింహ, ప్రభు దాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలే జయంతి

**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** సావిత్రిబాయి పూలే ఉపాధ్యాయురాలు ఈమె వల్ల మహిళలకు బడుగు బలహీన వర్గాల పేద ప్రజల మహిళలకు చదువు చెప్పి, ఎంతోమందిని జ్ఞానం వైపు నడిపించింది. ముఖ్యంగా మాత సావిత్రిబాయి పూలే వల్లే చదువులు వచ్చాయి. అని బహుజన్ సమాజ్ పార్టీ పఠాన్ చెరువు నియోజకవర్గ ఇన్చార్జి సుంకు వినయ్ కుమార్ అన్నారు. ఈరోజు మాత సావిత్రిబాయి పూలే 195 పుట్టినరోజు సందర్భంగా శ్రీ వాణి విద్యాని కేతన్ ఓల్డ్ ఎం ఐ జి స్కూల్ లో ఏర్పాటుచేసిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులకు ఆమె జీవిత చరిత్ర చెప్పడంవల్ల అప్పటి కాలంలో ఇన్ని కష్టాలు ఎదు–రయ్యాయా అనే విషయాలు ఇప్పటి విద్యార్థులు తెలుసుకొని బాధ్యతతో చదవగలుగుతారు. సావిత్రిబాయి పూలే జయంతి



సందర్భంగా ఉపాధ్యాయురాలను సన్మానించడం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమానికి బహుజన సమాజ్ పార్టీ పటాన్ చెరువు నియోజకవర్గ అసెంబ్లీ జనరల్ సెక్రెటరీ ప్రశాంత్ కుమార్ సీనియర్ నాయకులు సంజీవ జనార్దన్ బ్యాగర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని బహుజన సమాజ్ పార్టీ పటాన్ చెరువు అసెంబ్లీ ప్రెసిడెంట్ పడమటి శ్రీశైలం ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపించారు.



## ఉత్తమ మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సావిత్రి బాయి జన్మదినోత్సవం వేడుకులకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జ్యోతి ప్రజ్వలన గావించి సావిత్రి బాయి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సామాజిక సంస్కర్త సావిత్రి బాయి ఫూలే జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలను శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించడం జరిగిందని అన్నారు. సావిత్రి బాయి పూలే మహిళా విద్యకు నాంది పలికిన మహోన్నత వ్యక్తి అని, కుల వివక్ష, లింగ వివక్షలను ఎదుర్కొని బాలికల విద్య కోసం అహర్నిశలు శ్రమించారని పేర్కొన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో డి ఇ.ఒ.రాజు, జిల్లా అధికారులు, మహిళా ఉపాధ్యాయులు, విద్యా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## టూరిజం అభివృద్ధి కోసం జాయింట్ సర్వే నిర్వహించాలి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** జుక్కల్ మండలం కౌలాస్ గ్రామంలో ఉన్న చారిత్రక కౌలాస్ కోట ముందు గల ప్రభుత్వ భూమిలో టూరిజం అభివృద్ధి చేపట్టేందుకు అవసరమైన స్థల పరిశీలన కోసం రెవెన్యూ , అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా (జాయింట్ సర్వే) నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. శనివారం తన ఛాంబర్ లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి సంబంధిత భూమి పరిస్థితులు, ప్రభుత్వ భూమి హద్దులు, అటవీ పరిధి అంశాలను సమగ్రంగా పరిశీలించి, టూరిజం అభివృద్ధికి అనువైన ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. జాయింట్ సర్వే నివేదికను త్వరితగతిన సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, అటవీ శాఖ అధికారి నిఖిత, ఫారెస్ట్ ,రెవెన్యూ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి బాటలో రామాంజి గూడెం

**సర్పంచ్ మోకాల శేఖర్**

**అల్లపల్లి జనవరి 3 రాజముద్ర :** అల్లపల్లి మండలం రామాంజి గూడెం గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచ్ మోకాల శేఖర్ ప్రజా సేవలో తనదైన ముద్ర వేస్తున్నారు. గ్రామంలో వీధిలైట్ల ఏర్పాటు చేపట్టి ప్రజలకు భద్రత, సౌకర్యం కల్పిస్తూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంటున్నారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు సర్పంచ్ మోకాల శేఖర్ తెలిపారు. విడిదల వారీగా పంచాయతీలో అన్ని మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పనులు ముమ్మరంగా కొనసాగిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోగ్గల అనూష, మాజీ ఎంపీటీసీ పడిగ సమ్మయ్య, కరపటి బాబు, పుణ్యం సమ్మయ్య, పుణ్యం రాజమల్లు తదితరులు పాల్గొని సర్పంచ్‌కు మద్దతు తెలిపారు. గ్రామాభివృద్ధిలో కాంగ్రెస్ నాయకత్వం చురుకుగా పనిచేస్తోందని వారు ఈ సందర్భంగా ప్రశంసించారు. గ్రామ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కార దిశగా అడుగులు వేస్తున్న సర్పంచ్ మోకాల శేఖర్ నాయకత్వం రామాంజి గూడెం పంచాయతీకి మరింత అభివృద్ధి దిశను చూపుతోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



## సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి పూలే

**కాంగ్రెస్ మెదక్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జి నీలం మధు ముదిరాజ్**

**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** మహిళల సమానత్వం కోసం వారి అభ్యున్నతి కోసం ఉద్యమం చేసిన సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి పూలే అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. శనివారం సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని చిట్కుల్ లోని ఆయన నివాసంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా సావిత్రిబాయి పూలే మహిళలకు విద్యను సులభతరం చేసేందుకు విశేషంగా కృషి చేశారని కొనియాడారు. విద్య యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ అనేక రకాల కార్యక్రమాలను నిర్వహించారని తెలిపారు. ఆమె సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ఆమె జయంతి అయిన జనవరి 3వ తేదీని ప్రతి ఏట మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించింది గుర్తు చేశారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులందరికీ మహిళా ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు నీలం మధు ముదిరాజ్.



## మడమ తిప్పని ధీశాలి సావిత్రి బాయి పూలే

**బిజెపి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్**

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** భారతదేశ తొలి మహిళ ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త,స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళ ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే అని బిజెపి నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం సావిత్రిబాయి పూలే జయంతిని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల ఉన్న పురుషాధిక్యత ధోరణికి విరుద్ధంగా పోరాడి,విద్య ద్వారానే స్త్రీల విముక్తి సాధ్యపడుతుందని నమ్మి అణగారిన వర్గాల మహిళల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి సావిత్రి బాయి పూలే అని తెలిపారు. సమాజంలో ఎన్ని అవమానాలు,అవరోధాలు ఎదురైనా మహిళల విద్యావ్యాప్తి కోసం పాఠశాలలను ప్రారంభించిన మడమ తప్పని ధీశాలి సావిత్రి బాయి పూలే అని ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధానకార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు,నాయకులు జెల్లా సురేష్, మూడు రమేష్, జోగుపర్తి నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.





## సామాజిక విప్లవకారిణి సావిత్రి బాయి పూలే

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** సమాజంలోని రుగ్మతలను రూపుమాపడానికి ఆడపిల్లలకు విద్యను అందించి,కులవ్యవస్థకు,పితృస్వామ్యానికి వ్యతిరేకంగా మహిళల ఉద్ధరణకు కృషి చేసిన చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అని ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు పి.ముత్యాలు అన్నారు. తిరుమలాయపాలెం మండలంలోని సుబ్లేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సావిత్రిబాయి పూలే 195 జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సమాజంలో ఆనాడు ఉన్న సాంఘిక దురాచారాలను వ్యతిరేకించి,బాలిక విద్య ఉద్యమానికి పునాది వేసిన సంఘ సంస్కర్త అని తెలిపారు. మహిళలు తమ హక్కులు సాధించుకోవాలని,వారిని చైతన్య పరిచి స్త్రీల విద్యావ్యాప్తికి కృషి చేసిన సామాజిక విప్లవకారిణి అని ఆమె సేవలను కొనియాడారు. నేటి మహిళ ఉపాధ్యాయులకు సావిత్రి బాయి పూలే మార్గదర్శి అని ఆమె ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం మహిళ ఉపాధ్యాయురాలు భ్రమరాంబ,విజయను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాబు, మల్లికార్జున్, శ్రీనివాసరావు,కోటేశ్వరరావు,అబ్దుల్ సత్తార్,పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# వెనెజువెలాలో అమెరికా భీకర దాడులు

**ఎమర్జెన్సీ విధింపు**



**వెనెజువెలా :** వెనెజువెలా బాంబు పేలుళ్లతో దద్దరిల్లింది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడి పేరిట అగ్రరాజ్యం అమెరికా ఈ దాడులకు దిగింది. రాజధాని కరాకస్‌లో శనివారం తెల్లవారుజామున ఏడు చోట్ల భారీ పేలుళ్లు సంభవించాయి. దీంతో దేశంలో అత్యయిక పరిస్థితి విధించాల్సిన పరిస్థితి తలెత్తింది. ట్రంప్ ఆదేశాలతోనే తమ సైన్యం ఈ దాడులు చేస్తోందని అమెరికా ధ్రువీకరించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. సైనిక స్థావరాలు, పౌర నివాసాలే లక్ష్యంగా అమెరికా శనివారం దాడులకు పాల్పడినట్లు వెనెజువెలా వెల్లడించింది. దీంతో సైనిక స్థావరాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని తెలిపింది. దాడులు జరిగిన ప్రదేశాల్లో పరిస్థితిని సమీక్షించడానికి చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. ఈ దాడులతో దేశంలో జాతీయ అత్యయిక పరిస్థితి విధిస్తున్నట్లు ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురో ప్రకటించారు. ఈ దాడులకు వ్యతిరేకంగా వీధుల్లోకి రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

### అమెరికన్ ఎయిర్‌లైన్లకు నోటమ్..

ఈ దాడులకు ముందు అమెరికా విమానయాన సంస్థలకు యూఎస్ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ నోటమ్ జారీ చేసింది. అమెరికా విమానాలు వెనెజువెలా గగనతలాన్ని వినియోగించొద్దని హెచ్చరించింది. తాజా పరిణామాలపై కొలంబియా ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వెనెజువెలా ముఠాల నుంచి మాదక ద్రవ్యాలు అమెరికాను ముంచెత్తుతున్నాయని ట్రంప్ పలుమార్లు పేర్కొన్నారు. ఈ ముఠాలతో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోకు కూడా సంబంధాలున్నాయని ఆరోపిస్తుండడంతో.. అక్కడి ప్రభుత్వాన్ని కూల్చడానికి ట్రంప్ కార్యవర్గం ప్రణాళికలు రచిస్తున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. మరోవైపు ఇప్పటికే కరేబియన్ సముద్రంలో అమెరికా భారీగా బలగాలు, యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, అత్యాధునిక ఫైటర్‌జెట్‌లను మోహరించింది.

## బంగ్లాదేశ్‌లో దుండగుల దాడి..

**చికిత్స పొందుతూ హిందూ వ్యాపారి మృతి**

**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్‌లో మరో హిందువు ప్రాణాలు కోల్పోయాడు. ఇటీవల ఖోకన్ చంద్ర దాస్(50) అనే వ్యాపారిపై కొందరు దుండగులు దాడి చేసి.. నిప్పంటించిన సంగతి తెలిసిందే. వారి నుంచి తప్పించుకునేందుకు నాడు చెరువులో దూకిన ఆయన.. తాజాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు స్థానిక మీడియాలో కథనాలు వస్తున్నాయి. చంద్ర దాస్ క్యూర్‌బంగా బజార్‌లో ఔషధాలు, మొబైల్ బ్యాంకింగ్ వ్యాపారం చేస్తు న్నారు. ఇటీవల దుకాణాన్ని మూసి ఆటోలో ఇంటికి బయలుదేరగా.. మార్గమ ధ్యలో కొందరు దుండగులు ఆటోను ఆపారు. పదునైన ఆయుధాలతో చంద్ర దాస్‌పై దాడి చేశారు. అనంతరం ఆయన తలపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. వారి నుంచి తప్పించుకునేందుకు రోడ్డు పక్కనే ఉన్న చెరువులోకి దూకేశారు. తర్వాత స్థానికులు ఆయనను కాపాడి.. ఆస్పత్రికి తరలించారు. తమకు శత్రువులు ఎవరూ లేరని, ఆయనపై ఎందుకు దాడి చేశారో తెలియదని ఖోకన్ భార్య సీమా దాస్ పేర్కొన్నారు. విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హాదీ హత్యతో దేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

**14 మంది మావోయిస్టులు మృతి**

**సుక్మా :** ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. శనివారం మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు చోటు చేసు కున్నాయి. ఈ ఘటనలో 12 మంది మావోయిస్టులు తమ ప్రాణాలు కోల్పో యారని పోలీసులు వెల్లడించారు. మ ృతుల్లో కొంటా ఏరియా కమిటీ కార్యదర్శి మంగడు ఉన్నారు. ఘటనా స్థలం నుంచి ఏకే-47, ఇన్సాస్ రైఫిల్స్, ఇతర ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మరో ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మ ృతి చెందారు. మావోయిస్టుల ఏరివేతలో భాగంగా కిస్టారం పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం సుక్మా జిల్లా రిజర్వ్ గార్డ్ సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించింది. ఈ క్రమంలో పామ్లూరు గ్రామం సమీపంలో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు మొదలయ్యాయి. ఈ ఘటనలో మొత్తం 12 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోగా.. మంగడు మినహా మిగతా వారి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. మరోవైపు.. బీజాపుర్ జిల్లాలో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు చనిపోయారు. ఈ ఎదురుకాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. కాగా.. గత ఏడాది జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 285 మందికిపైగా మావోయిస్టులు మృతి చెందారు.

## టీఆర్టిఎఫ్ డైరీ ఆవిష్కరించిన అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్టిఎఫ్) నూతన సంవత్సర డైరీని ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని కోరారు. ప్రాథమిక స్థాయిలో ప్రతి విద్యార్థికి కనీస అభ్యసన సామర్థ్యాలను అందించేందుకు కృషి చేయాలన్నారు. పదో తరగతి ఫలితాల్లో ఖమ్మం జిల్లాను ఉన్నత స్థానంలో నిలపాలని చెప్పారు. అదే విధంగా టిఆర్టిఎఫ్ యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ చాలా బాగుందని కితాబిచ్చారు. తొలుత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో టీఆర్టిఎఫ్ నాయకులు అదనపు కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ చావా శ్రీనివాసరావు,ఎంఈఓ రాములు నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ పెసర ప్రభాకర్ రెడ్డి,సిఎంఓ ప్రవీణ్ కుమార్,ఏఎస్ఓ కిషోర్ కుమార్,ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మంగపతిరావు,డిఇఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎం.దేవేందర్ కుమార్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ధరావత్ రాములు,ఖమ్మం జిల్లా అధ్యక్షులు మట్ట శ్రీనివాస్,జిల్లా ప్రధాన కార్యదర్శి సింగారపు వేణు,మనోరమ,తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ ఉన్న పేరును కొనసాగించి అధిక నిధులు కేటాయించాలి

- పెండింగ్ లో ఉన్న ఉపాధి డబ్బులు వెంటనే విడుదల చేయాలి
- బంటారం నుండి తోరుమామిడి కాల్ కూడా వరకు డబల్ రోడ్డు వెయ్యాలి
- తాండూర్ వికారాబాద్ నుండి ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** శనివారం వికారాబాద్ జిల్లా పరిధిలోని బంటారం మండల తోరుమామిడి గ్రామంలో సిపిఎం గ్రామ శాఖ లక్ష్మయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి సిపిఎం వికారాబాద్ జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ హాజరై మాట్లాడుతూ... వికారాబాద్ నుండి తాండూర్, తాండూర్ నుండి తొర్మామిడి వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం రోజుకు నాలుగు సార్లు పెంచాలని బంటారం నుండి తొర్మామిడి, కల్ కూడా వరకు డబల్ రోడ్డు ఏర్పాటు చేయాలని రోడ్డు బాగు లేక ప్రయాణికులు పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలు ఇందిరమ్మ ఇండ్లు, రైతు రుణమాఫీ, రైతు బంధు అమలు చేయాలని తెలిపారు. గ్రామంలో మంచి నీళ్ళ సమస్య కరెంటు వీధిలైట్ల సమస్య వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ ప్రాంతంలో రైతులు పండిస్తున్న చెరుకు, పసుపు, పత్తి ఇతర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, పంటలకు ఇన్సూరెన్స్ సౌకర్యం ఇవ్వాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అనేక ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ మైనింగ్ ను వెంటనే అరికట్టాలని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 11 సంవత్సరాలుగా ఉపాధి హామీ పథకాన్ని నీరుగారుస్తూ పేరు మారుస్తూ చట్టాన్ని, అందులో లోసుగులు పెట్టి బడ్జెట్ పెంచకుండా 40 శాతం రాష్ట్రాలు భరించాలి అంటూ రాష్ట్రాలకు ఇవ్వవలసిన బడ్జెట్ ఇవ్వకుండా రాష్ట్రాలపై భారాలు మోపడం కేంద్ర ప్రభుత్వం పద్ధతి సరికాదని తెలిపారు. మోడీ ప్రభుత్వం రకరకాల పేరుతో ఉపాధి హామీ పథకం పేదలకు రైతులకు కూలీలకు దక్కకుండా చేస్తూ ఇబ్బంది పెట్టడం సరైన పద్ధతి కాదని, తక్షణమే నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతు కార్మిక ఉపాధి వ్యతిరేక బిల్లులను వెనక్కి తీసుకోవాలి లేనిపక్షంలో రాబోయే కాలంలో బీజేపీకి పుట్టగతులు లేకుండా చేసేందుకు రైతులకు కూలీలు కార్మికులము పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. అనేక పోరాటాల ఫలితంగా పోరాడి తెచ్చుకున్న 21 సంవత్సరాల ఉపాధి హామీ చట్టాన్ని, కార్మిక, రైతు చట్టాలను నేడు మోడీ ప్రభుత్వం తన మంద బలం ఉందనే పేరుతో పార్లమెంటులో బిల్లులు తేవడం మార్చడం సరైన పద్ధతి కాదన్నారు. దేశ సంపదను, కార్మికుల రైతుల సంపదను కార్పొరేట్ అంబానీ ఆదానీలకు భూస్వాములకు కట్టుపెట్టడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. పేదల ఓట్లతో గద్దెనెక్కిన కేంద్ర పాలకులు వైఖరి మార్చుకోవాలన్నారు. కర్ణాటక బార్డర్ లో ఉన్న బంటారం మండల గ్రామాలను పేదలకు పాలకులకు సంబంధం లేదు అన్నట్లుగా వదిలేయడం సరైంది కాదన్నారు. ఈ వెనుకబడ్డ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ఈ పాలకులు కృషి చేయాలని డిమాండ్ చేస్తామని లేనిచో ఆందోళన పోరాటాలు తీవ్రతరం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, సిపిఎం గ్రామ నాయకులు లక్ష్మణ్, లక్ష్మయ్య, బండి నరసింహులు, కార్మిక సంఘం నాయకులు ఏసన్న వసంత్ తదితరులు పాల్గొన్నారు.



## కొత్తగా కొలువు దీరిన సర్పంచ్ శివరాణి రాజేందర్

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలం ఉప్పల్వాయి గ్రామంలో శనివారం రోజున కొత్తగా ఎన్నికైన నూతన సర్పంచ్ కనుకంటి శివరాని రాజేందర్ ప్రమాణ స్వీకారం చేశారు , అనంతరం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు, సర్పంచ్ ను, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లు అందరూ చాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఎంఈఓ ఆనందరావు, ఉప సర్పంచ్ పర్వారెడ్డి, వార్డ్ మెంబర్లు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్ :** భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సామాజిక సంస్కర్త, కవి, రచయిత్రి, స్వర్గీయ శ్రీమతి శ్రీ సావిత్రిభాయి పూలే గారి 195 వ జయంతి సందర్భంగా ఈరోజు అసోసియేషన్ ఆఫీస్ బీహెచ్ఈఎల్ ప్రాంగణంలో జరిగిన జయంతి కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు రెహమాన్ పాల్గొని విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజానికి వారు చేసిన సేవలైనటువంటి మొట్టమొదటి బాలికల పాఠశాల తెరిచి అణగారిన బాలికలకు విద్యను అందిచడం, వితంతు ఆశ్రమాలు ఏర్పాటు చేయడం, కుల వ్యవస్థ, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా మహిళా విభాగం స్థాపించి, కులాంతర వివాహాలు జరిపించడం, ప్లేగు బారిన పడిన పేదలకు వైద్య శిబిరాలు నడిపి, ఆహారం అందించడం, వంటి కార్యక్రమాల కోసం వారి వ్యక్తిగత జీవితాన్ని సమాజసేవ కోసం త్యజించిన మహిళామూర్తిని మనమందరం ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని పిలుపునియ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీఎస్ఐఐసి చైర్మన్ తూర్పు నిర్మలాజగ్గారెడ్డి జిఎం హెచ్ఆర్ డాక్టర్ సంధ్యాకర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్ మహిపాల్ రెడ్డి వలిద్దీన్ కార్యవర్గ సభ్యులు, అధికసంఖ్యలో కార్మికులు, వివిధ యూనియన్ల ప్రతినిధులు, అసోసియేషన్ల ప్రతినిధులు, అధికారులు మిత్రులు పాల్గొనడం జరిగింది.



## ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేస్తాం

**వికారాబాద్ జిల్లా ఇంచార్జి అదనపు కలెక్టర్ రాజేశ్వరి**

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** శనివారం ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియపై లక్ష్యం మేరకు మ్యాపింగ్ పూర్తి చేసే విధంగా జిల్లా కలెక్టర్ లు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఎన్నిక అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులకు విధివిధానాలను సూచించారు. రాబోవు12 రోజుల్లోగా నిర్దేశించిన లక్ష్యం మేరకు ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ ను వేగవంతం చేసి పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు 30 వేల నుండి 40 వేలు, సహాయ ఎన్నికల అధికారులు 3 వేల నుండి 4 వేలు, బి ఎల్ ఓ సూపర్వైజర్లు 300 నుండి 400 లు, బిఎల్ఓ లు 30 నుండి 40 వరకు ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను చేపట్టాలని ఆయన తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి మ్యాపింగ్ చేసే విధంగా చూడాలని అధికారులకు తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు గుర్తింపు కార్డులు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లాలో రోజువారీగా నిర్దేశించిన లక్ష్యం మేరకు 16264 ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని వికారాబాద్ జిల్లా ఇంచార్జి అదనపు కలెక్టర్ రాజేశ్వరి తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 52.65 శాతం మ్యాపింగ్ చేపట్టడం జరిగిందని, నిర్దేశించిన సమయం లోగా 75 శాతం ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను చేపట్టి పూర్తి చేస్తామని ఆమె తెలిపారు. వివిధ ఎన్నికల బాధ్యతల్లో ఉన్న అధికారులకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేస్తామని ఆమె తెలిపారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి మంగి లాల్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నైమత్ అలీ, వికారాబాద్ తహసిల్దార్ లక్ష్మి నారాయణ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**కోడంగల్‌లో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా కోడంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు, యువత కోడంగల్ ప్రధాన చౌరస్తాలో భారీ మానవహారంగా ఏర్పడి వాహనదారులకు రోడ్డు నిబంధనలపై ప్లకార్డుల ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో జరిగిన సభలో ఆమె ప్రసంగిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి పౌరుడు స్వచ్ఛందంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పిలుపునిచ్చారు. సభను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ నేటి సమాజంలో రోడ్డు ప్రమాదాలు అత్యధికంగా మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్షణ కాలం అజాగ్రత్త మితిమీరిన వేగం ఒక నిండు ప్రాణాన్ని బలి తీసుకోవడమే కాకుండా ఆ కుటుంబం మొత్తాన్ని రోడ్డున పడేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద తమ కోసం ఎదురుచూసే తల్లిదండ్రులు, భార్యాపిల్లలను గుర్తుంచుకొని వాహనం నడపాలని ముఖ్యంగా యువత బైక్ రేసింగ్‌లు, విన్యాసాల జోలికి వెళ్లకూడదని, హెల్మెట్ అనేది కేవలం చలాన్ల నుంచి తప్పించుకోవడానికి కాదని, అది మీ ప్రాణానికి రక్షణ కవచమని స్పష్టం చేశారు. కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, ఏఎంవిఐ లక్ష్మి, పరిగి డిఎస్పి శ్రీనివాస్, పరిగి ఎంవిఐ వేరేంద్ర నాయక్, కోడంగల్ సిఐ శ్రీధర్ రెడ్డి, కోడంగల్ ఎస్ఐ సత్యనారాయణ, కోడంగల్ లోని లారీ, ఆటో యూనియన్ సభ్యులు, కళాశాల, పాఠశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొనడం జరిగింది.

# సాంకేతిక లోపంతో ఖాతాలో రూ.40 కోట్లు

## నిమిషాల్లో రూ.1.75 కోట్ల లాభం



సాంకేతిక లోపం వల్ల ఓ ట్రేడర్ ఖాతాలో రూ.40 కోట్లు వచ్చి పడ్డాయి. ఆ డబ్బును అతడు స్టాక్స్‌లో పెట్టుబడి పెట్టగా 20 నిమిషాల్లో ఏకంగా రూ.1.75 కోట్ల లాభం వచ్చింది. అయితే అనుకోకుండా అతడి ఖాతాలో జమ అయిన తమ డబ్బుతో ట్రేడర్ లాభాలు పొందినట్లు ఆరోపిస్తూ.. కోటక్ సెక్యూరిటీస్ కోర్టును ఆశ్రయించింది. ఈ కేసులో న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో ఈ వ్యవహారం వైరల్‌గా మారింది. 2022లో కోటక్ సెక్యూరిటీస్‌లో తలెత్తిన సాంకేతిక లోపం వల్ల ఓ స్టాక్ ట్రేడర్ ఖాతాలో కోటక్‌కు చెందిన రూ.40 కోట్లు జమయ్యాయి. ఈ డబ్బును ట్రేడర్ స్టాక్స్‌లో పెట్టడంతో కేవలం 20 నిమిషాల్లోనే అతడికి రూ.1.75 కోట్ల లాభం వచ్చింది. అనంతరం తమ వ్యవస్థలో తప్పిదాన్ని గుర్తించిన కోటక్ సెక్యూరిటీస్ ట్రేడర్‌ను సంప్రదించడంతో కొంతకాలం తర్వాత అతడు కోటక్ నుంచి జమ అయిన రూ.40 కోట్లను తిరిగి ఇచ్చాడు. అయితే రూ.40 కోట్లతో పాటు వాటిని స్టాక్స్‌లో పెట్టి ఆర్జించిన రూ.1.75 కోట్ల లాభాన్ని కూడా తమకే ఇవ్వాలని కోటక్ డిమాండ్ చేసింది. అందుకు అతడు అంగీకరించకపోవడంతో ఇరువర్గాలు బాంబే హైకోర్టును ఆశ్రయించాయి. దీనిపై ఇటీవల విచారణ జరిపిన న్యాయస్థానం తన స్టాక్ ట్రేడర్ కోటక్ సెక్యూరిటీస్ నుంచి వచ్చిన డబ్బుతో సంపాదించిన రూ. 1.75 కోట్ల లాభం అతడికే చెందుతుందని తీర్పునిచ్చింది. దీనివల్ల సంస్థకు ఎలాంటి నష్టం కలగలేదని.. ఇది అన్యాయంగా సంపాదించిన డబ్బు కూడా కాదని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ట్రేడర్ సొంత రిస్క్‌పై స్టాక్స్‌లో పెట్టినందు వల్ల లాభం కూడా అతడికే సొంతమవుతుందని తెలిపింది. విచారణలో భాగంగా ట్రేడర్ తమ డబ్బుతో సంపాదించిన మొత్తాన్ని తమకు ఇచ్చేస్తే అతడికి రూ.50 లక్షలు ఇస్తామని కోటక్ సెక్యూరిటీస్ ఆఫర్ ఇవ్వగా అందుకు అతడు తిరస్కరించాడు. ఈ కేసుపై తదుపరి విచారణను ఫిబ్రవరి 4కు వాయిదా వేస్తున్నట్లు బాంబే హైకోర్టు వెల్లడించింది.




# ముస్తాఫిజుర్‌ను రిలీజ్ చేయండి

## కేకేఆర్‌కు బీసీసీఐ ఆదేశాలు

**బంగ్లాదేశ్‌లో హిందువులపై వరుస దాడుల నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ ఆటగాడు ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్ 2026 మినీ వేలంలో రికార్డు ధర రూ.9.2 కోట్లకు కోల్‌కతా నైట్ రైడర్స్ దక్కించుకోవడంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ముస్తాఫిజుర్ రెహమాన్‌ను రిలీజ్ చేయాలని బీసీసీఐ తాజాగా కేకేఆర్‌కు ఆదేశాలిచ్చింది. ఈ విషయాన్ని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా ధ్రువీకరించారు.**




అయితే గురువారం కూడా ముస్తాఫిజుర్ ఎంపికపై బీసీసీఐ వర్గాలు స్పందించినట్లు వార్తలు వచ్చాయి. బంగ్లాదేశ్ ఆటగాళ్లను ఐపీఎల్‌లో ఆడకుండా నిరోధించడంపై తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గనిర్దేశకాలు రాలేదని పేర్కొన్నాయి. ఇది తమ చేతుల్లో లేని వ్యవహారమని, దీనిపై ఇంతకుమించి మాట్లాడటానికి ఏమీ లేదని వెల్లడించాయి. రెహమాన్ 2016లో ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. ఇప్పటివరకు 60 మ్యాచ్‌లు ఆడి 65 వికెట్లు తీసుకున్నాడు. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తమ జట్టు ఆడే సిరీస్‌లపై ప్రకటన చేసిన విషయం తెలిసిందే. దౌత్య విభేదాల వేళ భారత్‌తో షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది. భారత్‌తో ఆగస్టు-సెప్టెంబరు మధ్య మూడు వన్డేలు, మూడు టీ20 సిరీస్‌లు ఆడనున్నట్లు తెలిపింది. గత ఏడాది రెండు జట్ల మధ్య సిరీస్‌లు జరగాల్సిఉండగా.. రాజకీయ ఉద్రిక్తతల వల్ల నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈ ఆగస్టు టూర్‌తో అది భర్తీ కానుందని బీసీబీ వెల్లడించింది. అయితే ముస్తా ఫిజుర్ రెహమాన్ విషయంలో బీసీసీఐ తీసుకున్న తాజా నిర్ణయంతో ఈ సిరీస్‌లో టీమ్ఇండియా పాల్గొనేది కూడా అనుమానమే.

### ఆ మొత్తం కేకేఆర్‌కు తిరిగి వస్తుందా?..


బంగ్లాదేశ్ ఆటగాడు ముస్తాఫిజుర్ రెహమాన్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు ఇటీవల జరిగిన ఐపీఎల్ మినీ వేలం 2026లో 9.20 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అయితే బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం రాజకీయ అనిశ్చితి తలెత్తిన నేపథ్యంలో అక్కడి హిందువులపై వరుస దాడులు కొనసాగుతుండటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో బంగ్లా ఆటగాడిని ఐపీఎల్‌లో ఆడించనుండటంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీన్ని పరిగణలోకి తీసుకున్న బీసీసీఐ.. ముస్తాఫిజుర్ రెహమాన్‌ను రిలీజ్ చేయాలని కేకేఆర్ ఫ్రాంఛైజీని శనివారం ఆదేశించింది. దీంతో అతన్ని కేకేఆర్ విడుదల చేసింది. ముస్తాఫిజుర్ ఒక్క బంతిని కూడా బౌల్ చేయకుండానే ఐపీఎల్ నుంచి నిష్క్రమించినట్లైంది. అయితే అతడి కోసం కేకేఆర్ వెచ్చించిన ఆ రూ.9.20 కోట్లు వారి పర్స్‌కు తిరిగి చేరతాయా? లేదా? అనే సందేహాలు నెలకొన్నాయి. ఈ విషయంలో ఐపీఎల్ వేలం నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..

### ఒక్కసారి క్రీడాకారుడిని కొనుగోలు చేస్తే..

ఏదైనా ఫ్రాంఛైజీ ఒక్కసారి ఆటగాడిని వేలంలో దక్కించుకుంటే.. దాని పర్స్ నుంచి ఆ మొత్తం మైనస్ అవుతుంది. అయితే ప్రస్తుతం ముస్తాఫిజుర్ అంశం ప్రత్యేకమైంది. అలాగే తప్పనిసరిగా అతన్ని రిలీజ్ చేయమని బీసీసీఐ ఆదేశించింది. భారత క్రికెట్ బోర్డు జోక్యంతో, క్రికెట్‌కు సంబంధం లేని కారణాలతో ముస్తాఫిజుర్ జట్టుకు దూరమయ్యాడు. కాబట్టి ఐపీఎల్ నిబంధనల ప్రకారం కేకేఆర్ పర్స్‌లోకి ఆ మొత్తం వచ్చి చేరుతుంది. అయితే ముస్తాఫిజుర్.. కేకేఆర్, బీసీసీఐ నుంచి పరిహారం డిమాండ్ చేసే అవకాశం ఉంది. అదే జరిగితే పరిస్థితి ఏంటనే అంశం ప్రస్తుతం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

### ఎప్పుడు..? ఎలా..?

కోల్‌కతా నైట్ రైడర్స్ ఫ్రాంఛైజీ ముస్తాఫిజుర్ రెహమాన్ స్థానంలో మరో ఆటగాడిని తీసుకోవడానికి అనుమతిస్తామని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ధ్రువీకరించారు. కానీ.. ఆ నిధులు ఎప్పుడు?.. ఎలా..? కేకేఆర్ తిరిగి పొందుతుందో ఆయన ప్రత్యేకంగా వివరించలేదు. అయితే మొత్తానికి కేకేఆర్ పర్స్‌లో త్వరలోనే రూ.9.20 కోట్లు వచ్చి చేరే అవకాశముంది. డెత్ ఓవర్ల స్పెషలిస్ట్‌గా పేరున్న ముస్తాఫిజుర్ స్థానాన్ని కేకేఆర్ ఏ ఆటగాడితో భర్తీ చేయనుందనే విషయంలో మాత్రం ఆసక్తి నెలకొంది.



# ఈవీ బ్యాటరీలకు ఆధార్ తరహా నంబర్..

ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) బ్యాటరీలకు ఆధార్ నంబర్ తరహా విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వాలని కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. ఈ విధానం ద్వారా బ్యాటరీల ఎండ్-టు-ఎండ్ జాడను గుర్తించడంతో పాటు సమర్థమైన రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడం దీని ముఖ్య ఉద్దేశం. ఈ మేరకు ముసాయిదా మార్గదర్శకాలను జారీ చేసింది. దీని ప్రకారం.. బ్యాటరీ తయారీదారు లేదా దిగుమతిదారు మార్కెట్‌లోకి తెచ్చే ప్రతి బ్యాటరీ ప్యాక్‌కు 21 అక్షరాల 'బ్యాటరీ ప్యాక్ ఆధార్ నంబర్' తప్పనిసరిగా కేటాయించాలి. ఈ నంబర్ బ్యాటరీపై స్పష్టంగా కనిపించేలా, తొలగించడానికి వీల్లేకుండా ఉండాలి. బ్యాటరీలో వినియోగించే ముడిపదార్థాల దగ్గర నుంచి, వినియోగం, రీసైక్లింగ్ వరకు వివిధ దశలకు సంబంధించిన సమాచారాన్ని ఈ నంబర్ ద్వారా నిల్వ చేస్తారు. రీసైక్లింగ్ లేదా రీపర్పోజింగ్ వల్ల బ్యాటరీ లక్షణాలు మారితే కొత్త బ్యాటరీ కేటాయించాలి. ఇది బ్యాటరీ ఎకోసిస్టమ్‌లో పారదర్శకత, జవాబుదారీతనం, స్థిరత్వం తెస్తుందని మంత్రిత్వ శాఖ ఆశిస్తోంది. బ్యాటరీ పనితీరు, పర్యావరణంపై ప్రభావాన్ని కూడా కచ్చితంగా ట్రాక్ చేయడం కుదురుతుందని తెలిపింది. ముఖ్యంగా సెకండ్-లైఫ్ వినియోగం, నిబంధనల అమలు, రీసైక్లింగ్‌లో సమర్థతలో కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. భారత్‌లో లిథియం-ఐయాన్ బ్యాటరీల మొత్తం డిమాండ్‌లో 80-90 శాతం విద్యుత్ వాహనాల నుంచే వస్తోంది. అందుకే మొదటి దశలో ఈవీ బ్యాటరీలకు ప్రాధాన్యం ఇస్తూ ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. బ్యాటరీ తయారీదారులు, ఈవీ తయారీదారులు, రీసైక్లర్లు, టెస్టింగ్ ఏజెన్సీలు, రెగ్యులేటరీ బాడీల ప్రతినిధులు ఈ కమిటీలో ఉంటారు. ఈ గుర్తింపు సంఖ్య వల్ల నకిలీ బ్యాటరీలను అరికట్టడమూ సాధ్యమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.




# రష్యా నుంచి చమురు దిగుమతుల వివరాలు ఇవ్వండి

## రిఫైనరీలను అడిగిన కేంద్రం

అమెరికా ఆంక్షలకు తలొగ్గకుండా డిస్కౌంట్ ధరకు లభిస్తోన్న రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తోంది. ఈ నేపథ్యంలో రష్యా నుంచి వారంపాటు చేసిన కొనుగోళ్ల వివరాలను ఇవ్వాలంటూ దేశ రిఫైనరీలను కేంద్రం అడిగినట్లు సమాచారం. అలాగే అమెరికా నుంచి చమురు దిగుమతుల వివరాలను కూడా అడిగినట్లు తెలుస్తోంది. అమెరికాతో ట్రేడ్ డీల్‌కు సిద్ధమైన నేపథ్యంలో ఈ డేటా తీసుకుంటున్నట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. 2022లో ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభించిన రష్యాపై పశ్చిమదేశాలు ఆంక్షలు విధించాయి. రష్యా రాయితీ ధరలకు చమురును విక్రయించడం ప్రారంభించడంతో, మన దేశం అతిపెద్ద దిగుమతిదారుగా మారింది. ఫలితంగా మొత్తం మన చమురు దిగుమతుల్లో రష్యా వాటా 1% నుంచి 40 శాతానికి చేరింది. దీనిపై అమెరికా, దాని మిత్ర దేశాలు గగ్గోలు పెడుతున్నాయి. రష్యా సంస్థలు రాస్‌నెఫ్ట్, లుక్‌ఆయిల్‌పై అమెరికా ఆంక్షలు విధించింది. అలాగే భారత్‌పై 50 శాతం సుంకాలు వేసిన సంగతి తెలిసిందే. భారత్‌తో తన వాణిజ్య లోటును తగ్గించుకోవాలని చూస్తోన్న యూఎస్‌ఏ.. వాణిజ్య ఒప్పందం చర్చల్లో భాగంగా టారిఫ్‌ల ద్వారా భారత్‌పై ఒత్తిడి తీసుకువస్తోంది. ఈ పరిణామాల వేళ.. రష్యా, అమెరికా చమురు కొనుగోళ్లకు సంబంధించిన డేటాను కేంద్ర ప్రభుత్వానికి చెందిన పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ రిఫైనరీలను అడిగింది. ఈ సమాచారం ఇవ్వాలని పీఎం కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. అమెరికాతో చర్చల సమయంలో ధ్రువీకరించిన సమాచారం అందుబాటులో ఉండేలా చూసుకుంటుందని మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇదిలాఉంటే.. డిసెంబరులో రష్యా నుంచి మన దేశానికి చమురు దిగుమతులు గణనీయంగా తగ్గాయి. దిగుమతులపై మన విధాన నిర్ణయాల్లో మార్పులేమీ రాలేదని, స్వల్పకాలిక అంతరాయాల వల్లే రష్యా నుంచి చమురు దిగుమతి తగ్గిందని చెబుతున్నారు. 2022 డిసెంబరు తర్వాత రష్యా నుంచి ఇంత తక్కువగా చమురు దిగుమతి కావడం ఈ నెలలోనే. 'రాస్‌నెఫ్ట్, లుక్‌ఆయిల్‌పై ఆంక్షల నేపథ్యంలో డిసెంబరులో రష్యా నుంచి చమురు దిగుమతులు భారీగా తగ్గాయి. ఇది స్వల్పకాల సర్దుబాటుగా కనిపిస్తోంది. కొత్త ఇంటర్‌మీడియరీలు రావడం, సరఫరా వ్యవస్థల పునరుద్ధరణ కారణంగా 2026 జనవరి నుంచి మళ్లీ దిగుమతులు పెరిగే అవకాశం ఉంది' అని రియల్ టైమ్ డేటా అనలిటిక్స్ కంపెనీ కెప్లర్ లీడ్ రీసెర్చ్ అనలిస్ట్ (రిఫైనింగ్-మోడలింగ్) సుమిత్ రిటోలియా పేర్కొన్నారు.



# న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు భారత జట్టు ప్రకటన..




టీమ్ఇండియాతో పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం త్వరలో భారత పర్యటనకు న్యూజిలాండ్ రానుంది. జనవరి 11 నుంచి మూడు వన్డేల సిరీస్, 21 నుంచి టీ20 సిరీస్ మొదలు కానున్నాయి. కివీస్‌తో వన్డే మ్యాచ్‌ల కోసం అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ శనివారం జట్టును ప్రకటించింది. శ్రేయస్ అయ్యర్‌కు టీమ్‌లో చోటు కల్పించారు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఫిట్‌నెస్ క్లియరెన్స్ వస్తేనే అతను మ్యాచ్‌లు ఆడతాడు. కివీస్‌తో వన్డేలకు భారత జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ (వైస్‌కెప్టెన్‌లి), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, మహ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్‌దీప్ యాదవ్, రిషభ్ పంత్, నితీశ్‌కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, యశస్వి జైస్వాల్.

### న్యూజిలాండ్‌తో మూడు వన్డేల షెడ్యూల్

జనవరి 11 తొలి వన్డే (వడోదర)
జనవరి 14 రెండో వన్డే (రాజ్‌కోట్)
జనవరి 18 మూడో వన్డే (ఇండోర్)

# పోలీసుల నిఘా నీడలో సిడ్నీ టెస్ట్



**సిడ్నీ:** యాషెస్ సిరీస్‌లో భాగంగా అయిదో టెస్ట్ మ్యాచ్ సిడ్నీ వేదికగా ఆదివారం ప్రారంభం కానుంది. ఇటీవలే బోండీ బీచ్‌లో ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సిడ్నీ మైదానం లోపల, వెలుపల భద్రత కట్టుదిట్టం చేశారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, సాయుధులైన పోలీసులు గస్తీ కాస్తారని న్యూసౌత్ వేల్స్ పోలీసు కమిషనర్ మాల్ లాన్యోన్ శనివారం తెలిపారు. మెల్‌బోర్న్‌లో నాలుగో టెస్ట్ జరిగిన నేపథ్యంలో తీసుకున్న పటిష్ట చర్యలనే సిడ్నీలోనూ కొనసాగించనున్నారు. పోలీసులు మైదానంతో పాటు, సమీపంలోని పార్క్, రైల్వేస్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పహారా కాస్తున్నారు. గత సంవత్సరం డిసెంబర్ 14న ఆస్ట్రేలియాలోని బోండీ బీచ్‌లో కాల్పులు జరిపి 15 మంది మృతికి కారణమైన ఉగ్రవాది నవీద్ అక్రమ్‌పై పోలీసులు 59 అభియోగాలను నమోదు చేశారు. అందులో 15 హత్య కేసులున్నాయి. మరో ఉగ్రవాది సాజిద్ హతం కావడంతో నవీద్ ఒక్కడి పైనే ఈ అభియోగాలను పోలీసులు మోపిన విషయం తెలిసిందే. చనిపోయిన ప్రతిఒక్కరి హత్యకు కారణమంటూ పోలీసులు విడివిడిగా అతడిపై 15 కేసులు నమోదు చేశారు. కాల్పులకు సంబంధించి 40 కేసులు పెట్టారు. పేలుడు పదార్థాలు తదితర నేరాలపై మరో నాలుగు కేసులు నమోదు చేశారు. అయిదు టెస్ట్ మ్యాచ్‌ల యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా ఇప్పటికే సిరీస్‌ను కైవసం చేసుకుంది. ప్రస్తుతం 3-1 ఆధిక్యంలో ఉంది. మెల్‌బోర్న్ టెస్ట్‌లో నాలుగు వికెట్ల తేడాతో ఇంగ్లాండ్ విజయం సాధించింది. చివరి మ్యాచ్‌లోనూ గెలిచి.. సిరీస్‌ను విజయంతో ముగించాలని ఆ జట్టు చూస్తోంది. నాలుగో టెస్ట్ రెండు రోజుల్లోనే ముగిసిన నేపథ్యంలో అయిదో మ్యాచ్ జరగనున్న సిడ్నీలో పిచ్ ఎలా స్పందిస్తుందోనని అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

# రాజకీయాలను క్రికెట్‌తో ముడిపెట్టొద్దు

## కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్



**న్యూఢిల్లీ :** బంగ్లాదేశ్‌లో హిందువుల మీద వరుస దాడులు జరుగుతున్న నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ తరుణంలో బంగ్లాదేశ్ ఆటగాడు ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్ 2026 మినీ వేలంలో రికార్డు ధర రూ.9.2 కోట్లకు కోల్‌కతా నైట్ రైడర్స్ దక్కించుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. తాజాగా దీనిపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ స్పందించారు. 'బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై జరుగుతున్న దాడులకు, క్రికెట్‌కు ముడిపెట్టకూడదు. అయితే ఆ దేశంలో మైనార్టీలపై దాడులు ఆగేలా చర్యలు తీసుకోవాలని మేం వారి ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ముస్తాఫిజుర్ రెహమాన్ అనే వ్యక్తి క్రికెటర్. అతడికి, మైనార్టీలపై దాడులకు ఏవిధమైన సంబంధమూ లేదు. అలాగే ఈ విషయంలో అతడిపై వ్యక్తిగతంగానూ ఏ విధమైన ఆరోపణలు లేవు. దాడులు, ఐపీఎల్‌కు అతడి ఎంపిక.. ఈ రెండింటినీ కలిపి చూడటం సరైన చర్య కాదు' అని శశిథరూర్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. 'క్రీడలకు, రాజకీయాలకు ముడిపెట్టొద్దు. మన పొరుగుదేశాల వారిని దూరం పెడుతూ పోవడం.. వారితో ఆడకుండా ఉండటం ఎలా సముచితమవుతుంది? మనం బంగ్లాదేశ్‌కు మూడు వైపులా విస్తరించి ఉన్నాం. మనం వారితో ఆడాల్సిందే' అని శశిథరూర్ విశ్లేషించారు. బంగ్లాదేశ్ ఆటగాళ్లు ఐపీఎల్‌లో ఆడే విషయంలో ఫ్రాంఛైజీని తప్పుపట్టిన భాజపాని కాంగ్రెస్ నాయకుడు, కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే 'ఎక్స్' వేదికగా విమర్శించారు. 'భాజపా వారు బంగ్లాదేశ్ ఆటగాడిని ఐపీఎల్‌లో తీసుకోవడాన్ని తప్పుపడుతున్నారు. విదేశీ ఆటగాళ్లు ఈ లీగ్‌లో ఆడుతున్నారంటే దానికి బీసీసీఐ, ఐపీఎల్ విధించిన నిబంధనలే కారణం. ఈ విషయంలో ఫ్రాంఛైజీని విమర్శించే బదులు, భాజపా నాయకులు.. బీసీసీఐనే ప్రశ్నించాలి' అని పేర్కొన్నారు. అలాగే గతంలో జరిగిన సంఘటనల గురించి కూడా ప్రస్తావించారు. 'పహల్గాం దాడి తర్వాత.. భారత్, పాక్‌తో మ్యాచ్‌లు ఆడితే భాజపా అభ్యంతరం తెలపలేదు. కొవిడ్ సమయంలో ఐపీఎల్ మ్యాచ్ లను ఇస్లామిక్ దేశాలకు తరలిస్తే అప్పుడూ ప్రశ్నించలేదు. ఫ్రాంఛైజీలను ప్రశ్నించే బదులు.. భాజపా వారు హోమ్ మినిస్టర్‌ను అడగాలి' అని ప్రియాంక్ ఖర్గే అన్నారు.



# సెబీ నుంచి కృత్రిమ మేధ టూల్

**ముంబయి:** నియంత్రిత సంస్థల సైబర్ భద్రతా సన్నద్ధతను విశ్లేషించడానికి కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత టూల్‌ను అభివృద్ధి చేసే పనిలో ఉన్నట్లు సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే వెల్లడించారు. మార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఎంఐఐలు) కోసం టెక్నాలజీ రోడ్‌మ్యాప్‌ను అభివృద్ధి చేయడానికి వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీఎస్ఈ సెన్సెక్స్ 40 వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్ ఆడిట్ నివేదికలు, నియంత్రణ లోపాలను గుర్తించడం, రిస్క్ ఆధారంగా సంస్థలను వర్గీకరించడం కోసమే ఏఐ టూల్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు పాండే వివరించారు.

www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

# నటనపై ఆసక్తి లేదన్న దర్శకుడు

## అలాంటి గ్రాప్‌లో పడనన్న అనిల్ రావిపూడి



ఫిల్మ్ ఇండస్ట్రీలో హీరోలు కావాలనుకుని ఇండస్ట్రీకి వచ్చి దర్శకులుగా స్థిరపడినవారు ఉన్నట్లే, దర్శకత్వ రంగంలోకి వచ్చి హీరోలుగా మారిన ఉదాహరణలూ ఉన్నాయి. నాని, రాజ్ తరుణ్ లాంటి వారు అసిస్టెంట్ డైరెక్టర్లుగా పని చేసి తర్వాత హీరోలుగా సక్సెస్ సాధించారు. మరోవైపు కొందరు సక్సెస్‌ఫుల్ దర్శకులు కూడా హీరోగా మారాలని ప్రయత్నించి ఆశించిన ఫలితాలు అందుకోలేక పోయిన సందర్భాలున్నాయి. ఈ నేపథ్యంలో టాలీవుడ్ లో వరుస హిట్లతో దూసుకెళ్తున్న దర్శకుడు అనిల్ రావిపూడి హీరోగా మారతారా? అన్న ప్రశ్న తరచూ సోషల్ మీడియాలో వినిపిస్తోంది. ఆయన స్టేజ్‌పై మాట్లాడే తీరు, కామెడీ టైమింగ్, మాస్ పల్స్ చూసి 'హీరో మెటీరియల్' అంటూ అభిమానులు కామెంట్స్ చేయడం కొత్త కాదు. అయితే ఈ విషయంపై అనిల్ రావిపూడి ఇచ్చిన సమాధానం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. హీరోగా సినిమా చేయొచ్చుకదా అని అడిగినప్పుడు అనిల్ రావిపూడి చాలా మెచ్యూర్డ్‌గా స్పందించారు.

# రజనీతో కమల్ మూవీ

## డైరెక్టర్‌గా శిబి చక్రవర్తి

అగ్ర కథానాయకుడు రజనీకాంత్ 173వ చిత్రానికి సంబంధించి బిగ్ అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ నటుడు కమల్ హాసన్ నిర్మాణ సారథ్యంలో రానున్న ఈ సినిమా దర్శకత్వ బాధ్యతలు చేపట్టే అవకాశం యువ డైరెక్టర్ శిబి చక్రవర్తికి లభించింది. ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడిస్తూ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ శనివారం ఓ ఫొటోను షేర్ చేసింది. 'ప్రతి హీరోకు ఓ ఫ్యామిలీ ఉంటుంది' అని రాసుకొచ్చింది. కమల్ సొంత నిర్మాణసంస్థ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై ఈ సినిమాను తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి అనిరుధ్ స్వరాలు సమకూరుస్తున్నారు. 2027 సంక్రాంతికి ఈ మూవీని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.అంతకుముందు ఈ సినిమాకు సుందర్.సి దర్శకత్వం వహిస్తున్నట్లు ప్రకటన వెలువడింది. అయితే, అనుకోని కారణాల వల్ల దర్శకత్వ బాధ్యతల నుంచి సుందర్ వైదొలిగారు. దీంతో కొత్త డైరెక్టర్ ఎవరై ఉంటారా? అని ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలోనే రజనీని డైరెక్ట్ చేసే అవకాశం శిబి చక్రవర్తికి లభించింది. ఈ యువ దర్శకుడు 2022లో తీసిన డాన్ తమిళ మూవీ బాక్సాఫీసు వద్ద మంచి విజయాన్ని అందుకుంది.




# మన శంకరవరప్రసాద్ గారు

# పోస్టర్ విడుదల




మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నచిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. సంక్రాంతికి వస్తున్నాం వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. మెగాస్టార్ చిరంజీవి, నయనతార ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. దీంతో వం-సగా ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది చిత్రయూనిట్. ఇప్పటికే పాటలను విడుదల చేసిన చిత్రయూనిట్.. జనవరి 4న ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. అయితే తాజాగా ఈ సినిమా విడుదలకు ఇంకా 9 రోజులు ఉందని తెలుపుతూ కౌంట్‌డౌన్ పోస్టర్‌ను పంచుకుంది. ఈ పోస్టర్‌లో చిరంజీవితో పాటు అమృతం ఫేమ్ హర్షవర్ధన్, హీరోయిన్ కేథరిన్, అభినవ్ గోమఠం ఉన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ, ఇప్పటికే కొత్త సినిమాలకు సంబంధించి పోస్టర్లు విడుదలయ్యాయి. ఆ పరంపర ఇంకా కొనసాగుతోంది. తాజాగా వివిధ సినిమాలకు సంబంధించి పోస్టర్లను ఆయా చిత్ర బృందాలు పంచుకున్నాయి. ఇందులో హర్షవర్ధన్, కేథరిన్, అభినవ గోమఠం తదితరులు చిరంజీవి వెనక నిలబడి ఉన్నారు. మరోవైపు ఓవర్సీస్‌లో టికెట్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. యూఎస్‌లో ఇప్పటికే 5వేలకు పైగా టికెట్లు విక్రయమయ్యాయి. సినిమా విడుదలకు 9 రోజుల సమయం మాత్రమే ఉండటంతో ఏపీ, తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలు చేయనున్నారు. జనవరి 3న రాజమహేంద్రవరంలో మొదలయ్యే ప్రచారం తిరుపతి, నెల్లూరు, విశాఖ, హైదరాబాద్, తాడేపల్లిగూడెం, అనంతపురం, వరంగల్, బెంగళూరుల్లో జరగనుంది. వీటిలోని కొన్ని వేదికల్లో చిరంజీవి పాల్గొంటారని సమాచారం. తిరుపతిలో ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. దీని రన్‌టైమ్ 2 నిమిషాల 30 సెకన్లుగా అనిల్ రావిపూడి తెలిపారు.





# గాంధీ టాక్స్.. మూకీ డ్రామా

## విజయ్ సేతుపతి, అరవింద్ స్వామిల కాంబో

భారతీయ చలనచిత్ర తెరపై దశాబ్దాల తర్వాత మళ్ళీ ఒక అద్భుత ప్రయోగం ఆవిష్కృతం కాబోతోంది. అప్పట్లో కమల్ హాసన్ నటించిన 'పుష్పక విమానం' వంటి మూకీ సినిమా ప్రేక్షకులను ఏ విధంగా మంత్రముగ్ధులను చేసిందో మనందరికీ తెలిసిందే. మళ్ళీ ఇన్నేళ్ల తర్వాత, అదే స్థాయిలో భావోద్వేగాలను పండించడానికి 'గాంధీ టాక్స్' అనే మూకీ డ్రామా సిద్ధమైంది. విలక్షణ నటుడు విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి ఈ చిత్రంలో ప్రధాన పాత్రలు పోషించబోతున్నారు. ఈ సినిమాలో మాటలు లేకపోయినా, కేవలం నటీనటుల హావభావాలు మరియు సంగీతంతోనే కథను ప్రేక్షకుల హృదయాలకు చేరువ చేసేలా ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ 'జీ స్టూడియోస్' ఈ చిత్రాన్ని గాంధీజీ వర్ధంతి సందర్భంగా జనవరి 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఇది మూకీ సినిమా అయినప్పటికీ.. తెలుగు, తమిళం, హిందీ, మరాఠీ మరియు మలయాళ భాషల్లో టైటిల్ కార్డులు, ప్రమోషన్లతో గ్రాండ్‌గా విడుదల కానుంది. విజయ్ సేతుపతి, అరవింద్ స్వామిలతో పాటు అందాల నటి అదితి రావు హైదరి, మరాఠీ నటుడు సిద్దార్థ్ జాదవ్ కీలక పాత్రల్లో నటించారు. మాటలు లేని ఈ సినిమాలో సంగీతమే ప్రాణం. అందుకే ఈ చిత్రానికి ఆస్కార్ విజేత, మ్యూజిక్ మాస్ట్రో ఏఆర్ రెహమాన్ అద్భుతమైన స్వరాలను అందిస్తున్నాడు. కిషోర్ పి. బేలేకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ఉమేష్ కుమార్ బన్సల్, రాజేష్ కేజీవ్రాల్, మీరా చోప్రా, కిషోర్ పాండురంగ్ బేలేకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

**చైతన్యరావు దిల్ దియా మూవీ పోస్టర్ విడుదల**

కీడా కోలా, ఘాటి సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో చైతన్య రావు ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతున్నాడు. ఆయన కథానాయకుడిగా దర్శకుడు కె. క్రాంతి మాధవ్ కాంబినేషన్‌లో ఒక నూతన చిత్రం రూపొందుతోంది. ఈ సినిమాకు 'దిల్ దియా' అనే టైటిల్‌ను ఖరారు చేయగా, 'ఏ నేక్డ్ ట్రూత్' అనేది ట్యాగ్ లైన్. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో చైతన్య సోఫాలో నగ్నంగా కూర్చోవడం చాలా విభిన్నంగా అనిపిస్తుంది. ఈ సినిమా థీమ్‌ను ప్రతిబింబించేలా ఫస్ట్ లుక్ ఉండటంతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. చైతన్య రావు ఈ సినిమాలో గత చిత్రాల కంటే భిన్నమైన గెటప్‌లో కనిపిస్తుండటం విశేషం. శ్రియాస్ చిత్రాస్, ఎ.పూర్ణ నాయుడు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై పూర్ణ నాయుడు ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. క్రాంతి మాధవ్ మార్క్ ఎమోషన్స్, చైతన్య రావు నటన ఈ సినిమాకు ప్రధాన బలం కానున్నాయి. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ మరియు విడుదల తేదీని ప్రకటించే అవకాశం ఉంది.




# దిష్టి తీయించుకో అనుపమ

టాలీవుడ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. ప్రేమమ్ మూవీతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన తన ఫస్ట్ మూవీతోనే మంచి ఫేమ్ తెచ్చుకుంది. ఆ తర్వాత అఆ, శతమానం భవతి, హలో గురు ప్రేమ కోసమే, రాక్షసుడు, కార్తికేయ-2 వంటి సినిమాల ద్వారా మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఇక చివరిగా బైసన్ మూవీతో ప్రేక్షకులను అలరించిన ఈ చిన్నది.. ప్రజెంట్ లాక్ డౌన్ సినిమాలో నటిస్తోంది.ఇదిలా ఉంటే నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉంటూ అభిమానులకు దగ్గరవుతూ ఉంటుంది. లేటెస్ట్ ఫొటో షూట్స్, సినిమాలకు సంబంధించిన విషయాలను ఫ్యాన్స్‌తో షేర్ చేస్తూ ఫాలోయింగ్ పెంచుకుంటుంది. ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా కొత్త సంవత్సరం సందర్భంగా అనుపమ తన ఇన్‌స్టాలో కొన్ని పిక్స్ షేర్ చేసింది.అందులో అదిరిపోయే అవుట్ ఫిట్‌లో దర్శనమిచ్చింది. అంతేకాకుండా హెయిర్ లీవ్ చేసుకుని బొట్టు పెట్టుకొని, గాజులు వేసుకుని కనిపించింది. ఇక దీనికి '96' అనే క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ కాస్త నెట్టింట వైరల్‌గా మారింది. ఇక దీన్ని చూసిన నెటిజన్లు దిష్టి తీయించుకో, సూపర్, ఎలాగా ఈ అందం అని, బాపు బొమ్మలా ఉన్నావ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com